ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 21 డిసెంబరు 2024





• రాష్ట్రస్థాయి పురస్కారం

అవార్డు అందుకుంటున్న కమిషనర్ శివరామకృష్ణ

తాడిపత్రి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వీధి దీపాలు, నీటి సరఫరా మోటార్ల వినియోగంలో విద్యుత్‌ను ఆదా చేసినందుకు తాడిపత్రి మున్సిపాలిటీకి స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ గోల్డెన్ అవార్డు వచ్చింది. విజయవాడలో ఈ అవార్డును మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ శుక్రవారం అందుకున్నారు. విద్యుత్‌ను ఆదాచేసినందుకు పురపాలక సంఘానికి ఈ అవార్డు వచ్చిందని కమిషనర్ తెలిపారు. అవార్డు రావడం పట్ల ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సహకరించిన తాడిపత్రి ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్చ్.. వేస్ట్..

నిరుపయోగంగా మార్కెట్‌యార్డు యార్డులో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్న రైతులు



6

అవినీతి... కొత్తపుంతలు

- ఫీనో అకౌంట్లు సృష్టించి బిల్లులు స్వాహా
- వంద రోజులు పని చేయకున్నా బిల్లులు
- దూర ప్రాంతాల్లో ఉన్న వారి పేరుతో రికార్డులు
- టెక్నాలజీతో రూ.కోటికిపైగా దోపిడీ
- సామాజిక తనిఖీలో తేలినా చర్యలు నిల్



7

మత్తుపై నిఘా పెట్టండి

■ ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై గట్టి నిఘా ఉంచాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మత్తు నివారణ చర్యలపై శుక్రవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. మన రాష్ట్రంలోని వైజాగ్, తెలంగాణ, ఒరిస్సా నుంచి జిల్లా వైపు వచ్చే రైళ్లు, బస్సులు, కార్లు.. ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలో మత్తుపదార్థాలను వినియోగించుకుండా కఠినచర్యలు చేపట్టాలని అన్నారు. యువతకు అవగాహన కల్పించాలని, విద్యాలయాలలో విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మత్తువల్ల జీవితాలునాశనమవుతాయి, చట్టపరమైన చర్యలు ఉంటాయని వారికి తెలియజేయాలని అన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఇతరశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ శాఖను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. జిల్లా ఆస్పత్రిలో అన్ని వసతులతో డీ అడిక్షన్ సెంటర్‌ను నడపాలని ఆదేశించారు.

మత్తు నివారణకు గట్టి చర్యలు: ఏఎస్పీ

జిల్లాలో మత్తు నివారణకు పోలీస్‌శాఖ గట్టి చర్యలు తీసుకుంటోందని ఏఎస్పీ రమణమూర్తి తెలిపారు. నవంబరు 16 నుంచి ఈ నెల 19వరకు దాడులు, తనిఖీలు నిర్వహించామని, ఒకరిపై కేసు నమోదు చేసి, 1521 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆకతాయిలు నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లి గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించామని, అలాంటి ప్రదేశాలలో మరింత గట్టి నిఘా పెట్టామని అన్నారు. అరకు, వైజాగ్ ప్రాంతాల నుంచి రైలులో గుత్తి మీదుగా అనంతకు గంజాయి చేరినట్లు గుర్తించామని తెలిపారు. రైల్వే స్టేషన్లలో విస్తృతంగా తనిఖీలు కొనసాగిస్తున్నామని అన్నారు. విద్యాలయాలు, గ్రామాలలోను అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమీక్షలో డీఆర్వో మలోల, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, డీటీసీ వీర్రాజు, హార్టికల్చర్ శాఖ డీడీ నరసింహారావు, విద్య, సంక్షమ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనులను వేగంగా చేయండి

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్ సిబ్బందిని ఆదేశించారు. డివిజన్ కార్యాలయంలోని సమావేశ భవనంలో శుక్రవారం ఆయన ఈఈ మురళీధర్‌రావుతో కలిసి జిల్లాలోని డీఈలు, జేఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్ల వారిగా అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. శింగనమల డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని డీఈ శ్రీరాములుకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రా ల్లో తాగునీరు, మరుగుదొడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షపు నీటి నిల్వలకు సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనులు జనవరి 10లోపు పూర్తి కావలని అన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన మురుగు కాలువల నిర్మాణాలకు సంబంధించి 475 పనులు వీలైనంత త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ కింద పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. నాణ్యతాలోపాలకు తావులేకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు.



ఇంటర్ చదువుతున్న ఓ బాలికకు తల్లిదండ్రులు పెళ్లి సంబంధం చూశారు. ఉన్నట్లుండి కాలేజీ మాన్పించారు. పెళ్లి ఇష్టం లేదని, చదువుకుంటానని ఆమె చెప్పినా తల్లిదండ్రులు వినిపించుకోలేదు. దీంతో ఆ బాలిక డయల్ 100కు ఫోన్ చేసింది. అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. మైనర్‌కు వివాహం చేయొద్దని, బాగా చదివించాలని సూచించింది. తమకూ చదివించాలనే ఉందని, కానీ కాలేజీకి వెళ్లొచ్చే సమయంలో తమ కూతురుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు అధికారులతో అన్నారు. ఆకతాయిలు, తాగుబోతులు వెంటపడి వేధిస్తున్నారని, అందుకే కాలేజీ మాన్పించామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఇబ్బందులు లేకుండా చూస్తామని, ధైర్యంగా బాలికను కాలేజీకి పంపించాలని అధికారులు సూచించారు. ఇది యాడికి పట్టణంలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటన..! ఆ ఒక్క బాలికే కాదు.. చాలామంది ఆకతాయిల వేధింపులు తాళలేక చదువు మానేస్తున్నారు. యాడికి పట్టణంలోని కాలేజీలు, పాఠశాలల వద్ద ఆకతాయిల ఆగడాలు పెరిగిపోయాయి. బాలికల భద్రత ప్రశ్నార్థకంగా మారింది అనేందుకు అనేక సంఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. - ఆంధ్రజ్యోతి, యాడికి

బడిదావలో పోకిరీలు




బాలికలకు భద్రత కరువు

చదువు మాన్పిస్తున్న తల్లిదండ్రులు.. బాల్య వివాహాల దిశగా అడుగులు

కూడళ్లలో తిష్ట

యాడికి మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, హైస్కూల్, ఆదర్శ పాఠశాలకు సమీప గ్రామాలు, పట్టణం నుంచి అధిక సంఖ్యలో బాలికలు వస్తుంటారు. పట్టణంలోని కొందరు పోకిరీలు, తాగుబోతులు వారి వెంటపడి వేధిస్తున్నారు. కాలేజీకి, బడికి వెళ్లే సమయంలో, తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో టార్గెట్ చేస్తున్నారు. కాలేజీ సమీపంలోని బస్టాప్, కోనరోడ్డు సర్కిల్, బస్టాండ్ సర్కిల్, పాత పోలీస్‌స్టేషన్ సర్కిల్, కమలపాడు సర్కిల్ వద్ద పోకిరీల బెడద ఎక్కువగా ఉంది. మరికొందరు యువకులు ఆదర్శ పాఠశాలకు వెళ్లే బస్సును బైక్‌లో ఫాలో అవుతున్నారు. వెకిలి చేష్టలు చేస్తున్నారు. ఆకతాయిల కారణంగా గ్రామీణ ప్రాంతాలకు కాలినడకన, సైకిళ్లు, ఆటోల్లో వెళ్లే



బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి భద్రత ప్రశ్నార్థకం కావడంతో తల్లిదండ్రులు చదువు మాన్పిస్తున్నారు.

భద్రత ఎక్కడ..?

- యాడికి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఓ బాలికపై కమలపాడు రోడ్డులో శ్మశాన వాటికవద్ద కొన్ని నెలల క్రితం ఇద్దరు యువకులు దాడి చేశారు. బాలికకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ విషయం గురించి బయటకు చెబితే తమ గౌరవం పోతుందని బాలిక తల్లిదండ్రులు మౌనంగా ఉండిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.
- పాఠశాల నుంచి ఇంటికి కాలినడకన వెళుతున్న ఓ బాలికను కోన రోడ్డు సర్కిల్‌లో కొందరు యువకులు వేధించారు. సమాచారం అందుకున్న బాలిక తల్లిదండ్రులు అక్కడికి వెళ్లేసరికి ఆకతాయిలు పారిపోయారు.
- వీరన్నపల్లి గ్రామానికి చెందిన ఇంటర్, తొమ్మిదో తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలు ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న సమయంలో తాగుబోతులు వెంటపడి వేధించారు. దీంతో తల్లిదండ్రులు చదువు మాన్పించారు. అధికారులు బాలికల ఇళ్ల వద్దకు వెళ్లి విచారించారు. తాగుబోతుల, ఆకతాయిల ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, నిఘా పెట్టిస్తామని, బాలికల చదువు మాన్పించవద్దని చెప్పి వచ్చారు.
- ఆదర్శ పాఠశాలకు బాలికలతో వెళ్లే బస్సును కొందరు పోకిరీలు బైక్‌లలో వెంబడించారు. అడ్డరోడ్డులో (యాడికి- రాయలచెరువు క్రాస్ రోడ్డు) ఫాలో అవుతూ వెకిలి చేష్టలు చేశారు. విషయం తెలుసుకున్న కొందరు తల్లిదండ్రులు వారిపై నిఘా వేశారు. వెంటపడి పట్టుకుని దేహశుద్ధి చేసి వదిలిపెట్టారు.



పోలీసులు స్పందించాలి..

బాలికల చదువుకు, భద్రతకు అడ్డుగా మారిన పోకిరీలు, తాగుబోతులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధాన కూడళ్లలో ఉదయం, సాయంత్రం పోలీసులు నిఘా పెడితే ఆకతాయిలు దొరికిపోతారని అంటున్నారు. లేదంటే బాలికల భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని, వారి భవిష్యత్తు నాశనమౌతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కళాశాల మానేసిన బాలిక ఇంటివద్ద వివరాలను ఆరాతీస్తున్న అధికారులు (ఫైల్)

చర్యలు చేపట్టాలి..



భద్రత లేకుంటే తల్లిదండ్రులు బాలికలను బడికి పంపలేరు. అందుకే ఆకతాయిల ఆగడాలపై పోలీసులు చర్యలు చేపట్టాలి. బాలికా విద్యను ప్రోత్సహించాలి. వేధింపులకు గురయ్యే వారు డయల్ 100, చైల్డ్‌లైన్ 1098కు ఫోన్ చేయాలి. గ్రామంలోని ఐసీడీఎస్ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చినా సమస్య పరిష్కారానికి కృషిచేస్తారు. - **మహాలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్, యాడికి**

అన్ని చెరువులకూ

నీరు చేరాలి

ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువ పరిధిలోని అన్ని చెరువులకు నీరు అందించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది హెచ్చెల్సీ, హంద్రీనీవా ద్వారా పూర్తి స్థాయిలో నీరు వస్తున్నందున అన్ని చెరువులు నింపాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికే కొన్ని చెరువుల్లో నీరు ఉందని, ఈ సారి ఏ ఒక్క ప్రాంతానికీ అన్యాయం జరగకూడదని అన్నారు. ఎక్కడా నీరు వృథా కాకుండా చూసుకోవాలని అన్నారు. అన్ని చెరువులకు 50 శాతానికి తగ్గకుండా నీరు అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని, ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తాము తీసుకుంటామని అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో అర్హులను గుర్తించి, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు.

● ధర్మవరం నియోజకవర్గంలో చాలా చెరువులకు నీరు అందడం లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడిమర్రి మండలంలోని చివరి చెరువులకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, అధికారులు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చీనీ.. టన్ను రూ.21 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో చీనీ కాయలు శుక్రవారం టన్ను గరిష్ఠంగా రూ.21 వేలు పలికాయి. కనిష్ఠ ధర రూ.9 వేలు, సరాసరి ధర రూ.14,400 పలికిందని మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 20 టన్నుల చీనీ కాయలు వచ్చాయని తెలిపారు.

టమోటా కిలో రూ.14

కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.14తో అమ్ముడుపోయిందని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని తెలిపారు. కిలో సరాసరి ధర రూ.10, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు వెల్లడించారు.

అడ్డదిడ్డంగా..

పేదల బియ్యం బొక్కేశారు



సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

- వైసీపీ పాలనలో యథేచ్ఛగా బ్లాక్‌మార్కెట్‌కు..
- దోపిడీ లెక్క తేల్చిన కూటమి ప్రభుత్వం
- ప్రస్తుతం బఫర్ పేరుతో కార్డుదారులకు కోత
- నేటికీ చక్కదిద్దలేకపోతున్న యంత్రాంగం
- పాతడీలర్లపై కేసుల నమోదుకు అడుగులు

అనంతపురం టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో యథేచ్ఛగా చౌకధాన్యపు దోపిడీ సాగింది. పేదలకు అందాల్సిన బియ్యాన్ని నాటి పాలకులు కొందరు అధికారులతో కుమ్మక్కై అడ్డంగా దోచేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరునెలలు గడుస్తున్నా చౌకధరల ధాన్యపు డిపోల్లో సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా సాగుతోంది. దీనిని నియంత్రించడానికి పాలకులుగాని, జిల్లా అధికారయంత్రాంగంగానీ చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

విచారణతో గుట్టు రట్టు

జిల్లాలో 1645 చౌకడిపోలు ఉన్నాయి. ఇందులో 6.5లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, రెసిడెన్సియల్ స్కూళ్లకు కూడా ఈ డిపోల నుంచే బియ్యం సరఫరా చేస్తారు. అధికారులు చెబుతున్న మేరకు కార్డుదారులు, స్కూళ్లకు కలిపి ప్రతినెలా మొత్తం 10,500 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే వైసీపీ పాలనలో ఈ బియ్యాన్ని చాలా వరకు పక్కదారి పట్టించారు. ఈఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అప్పుడు కూడా వైసీపీ సానుభూతిపరులైన కొందరు డీలర్లు డీలర్‌షిప్ తొలగిస్తారనే ప్రచారంతో జూన్, జూలై నెలలకు సంబంధించిన బియ్యాన్ని నల్ల బజారుకు తరలించి సొమ్ము చేసుకున్నారు. తర్వాత అధికార పార్టీ నాయకులు వైసీపీ డీలర్లను తొలగించి టీడీపీ మద్దతుదారులకు రేషన్ షాపులు అప్పగించారు. ఆ సమయంలో కార్డులకు రావాల్సిన బియ్యం సరఫరా కాలేదు. ఇదేమని అడిగితే అధికారులు పాత డీలర్లవద్ద బఫర్(మిగులు) ఉన్నాయని వాటిని తీసేసి ఇస్తున్నట్లు సమాధానమిచ్చారు. ఈ విషయంపై టీడీపీ డీలర్లు పార్టీ నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో జిల్లా యంత్రాంగం గుట్టుగా రేషన్‌పై విచారణ చేపట్టగా జిల్లావ్యాప్తంగా 2,654 మెట్రిక్ టన్నుల బియ్యం దోపిడీ జరిగినట్లు నిర్ధారించింది.

ఆరునెలలైనా అస్తవ్యస్తమే

టీడీపీ అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా ఇంకా చౌకధరల డిపోల్లో సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా సాగుతోంది. ప్రస్తుతం బియ్యంతో పాటు చక్కెర, కందిబేడలు ఇస్తున్నారు. కానీ అవి లబ్ధిదారులకు సక్రమంగా అందడం లేదు. బియ్యం కొరత ఉండడంతో చాలామందికి ఇవ్వాల్సిన మేరకు ఇవ్వడంలేదు. కార్డుపైనే 5 నుంచి 10 కిలోలో తగ్గిస్తున్నారు. అంత్యోదయకార్డుదారులకు 35కిలోలు ఇవ్వాల్సి ఉంది. కానీ 10నుంచి 15కిలోలు మాత్రమే ఇస్తున్నారు. కొందరు డీలర్లు అయితే బఫర్ స్టాక్ సమస్యను అధిగమించేందుకు లబ్ధిదారులకు డబ్బులు ఇచ్చి బియ్యం ఇచ్చినట్లు వేలిముద్రలు వేయించుకుంటున్నారు. చక్కెర, కందిబేడలకు బయటి మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో అరకొరగా ఇచ్చి, మిగిలిన స్టాకును బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.


వాహనం తిరగకపోయినా..

ఇంటింటికి రేషన్ సరఫరా కోసం వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తీసుకొచ్చింది. వైసీపీ కార్యకర్తలకే బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి రేషన్ పంపిణీ బాధ్యతలను అప్పగించారు. ఎండీయూ ఆపరేటర్లు దాదాపు 15రోజులు పాటు కేటాయించిన ప్రాంతాలకు వెళ్లి సరకులు అందించాలి. కానీ అలాచేయకుండా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో ఎండీయూ వాహనాలను తొలగిస్తుందనుకున్నారు. కొన్ని కారణాల వల్ల ఎండీయూ వాహనాల ద్వారానే ప్రస్తుతం రేషన్ అందిస్తున్నారు. డీలర్లు మారడంతో ఈవాహనాలను చాలా ప్రాంతాలలో ఉపయోగించుకోవడం లేదు. అయినా వాహనాలు తిరిగినట్లు చూపుతూ రెవెన్యూ అధికారులు ప్రతినెలా ఒక్కో వాహనానికి రూ.21వేలు బిల్లు చెల్లిస్తూ, అందులో తమ వాటా పంచుకొని ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్టాక్ పాయింట్ల నుంచే అక్రమాలు

వైసీపీ పాలనలో పౌరసరఫరాలశాఖ స్టాక్ పాయింట్ల నుంచే అక్రమాలు మొదలైనట్లు ఆరోపణలు ఉన్నాయి. తక్కువ తూకాలతో బియ్యం సరఫరా చేశారని పలువురు డీలర్లు ఆరోపించారు. అలాగే అప్పటి నాయకుల అండదండలతో స్టాక్‌పాయింట్ల నుంచే బియ్యం మాయం చేశారని పెద్దఎత్తున ఆరోపణలు వినిపించాయి. తాడిపత్రి, గుత్తి, శింగనమల, ఉరవకొండ, గుంతకల్లు పాయింట్లలో అత్యధికంగా అక్రమాలు జరిగినట్లు విమర్శలు ఉన్నాయి. తాడిపత్రిలోనే దాదాపు రూ.రెండు కోట్ల బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు వెలుగులోకి వచ్చింది. కొందరు పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాఖల అధికారుల సహకారంతోనే ఈ అక్రమాలు యథేచ్ఛగా జరిగినట్లు ప్రచారం ఉంది. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు మౌనంగా ఉండటంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం



ఇక్కడ బియ్యం వ్యవహారం అస్తవ్యస్తంగా ఉన్న మాట వాస్తవమే. విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసికెళ్లాం. ఆయన ప్రతి చౌకడిపోను తనిఖీ చేయమని ఆదేశించారు. బఫర్‌స్టాక్ మేరకు అక్కడ బియ్యం ఉన్నాయా? లేవా ?ఇపుడు పంపిన సరకులు లబ్ధిదారులకు సక్రమంగా అందించారా? లేదా అని పరిశీలిస్తున్నాం. అలాలేని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తున్నాం. ఇప్పటికే 11మంది డీలర్లపై కేసులు పెట్టించాం. అక్రమాల వ్యవహారం గత మూడేళ్లగా ఉన్నట్లు తెలుస్తోంది. అప్పుడే ఇలాంటి వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదో అర్థం కావడంలేదు. ఇపుడు మేము చక్కదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నాం. కొద్దిరోజుల్లో లబ్ధిదారులకు సమస్యలు తీరుస్తాం.

- వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

శబ్దం చేస్తే చర్యలు

ఎస్పీ జగదీష్ హెచ్చరిక

అనంతపురం క్రైం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను ద్విచక్ర వాహనాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. అనంతపురం నగరంలో టూవీలర్లకు బిగించిన అలాంటి 110సైలెన్సర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్లాక్ టవర్ సమీపంలో రోడ్డుపై వేసి.. రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయించారు. మోటారు వాహనాల చట్టం నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనాలకు భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లు బిగించుకుని రోడ్లపైకి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటివల్ల ప్రజలు అసౌకర్యానికి గురవుతారని, శబ్ద కాలుష్యం పెరుగుతుందని ఎస్పీ అన్నారు. ఒక్కోసారి వాహన చోదకుల ఏకాగ్రత లోపించి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని భారీ శబ్దాలు చేసుకుంటూ తిరుగుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామని అన్నారు. కంపెనీలు ఇచ్చే సైలెన్సర్లను మాత్రమే ఉపయోగించాలని వాహనదారులకు సూచించారు. సైలెన్సర్లను మారిస్తే వాహనదారుడితోపాటు మెకానిక్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. బైక్ యజమానికి 3 నెలల జైలు శిక్ష, రూ.10వేల వరకు జరిమానా పడుతుందని, 3నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు పాల్గొన్నారు.



సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్న ఎస్పీ జగదీష్

■ శరణమయ్యప్పా.. స్వామి..





అయ్యప్పస్వామికి చక్రస్నానం చేయిస్తున్న మాలధారులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలోని అయ్యప్పస్వామి ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం స్వామివారి చక్రస్నానం వైభవంగా జరిగింది. కోఆప్షన్ మెంబర్ గంగన లక్ష్మిరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వందలాదిమంది మాలధారులు హాజరయ్యారు. మొదటిరోడ్డులోని ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తిని హెచ్చెల్సీ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం కెనాల్‌లో ప్రసాద్ నంబూద్రి స్వామి చేతులమీదుగా స్వామివారికి శాస్త్రబద్ధంగా చక్రస్నానం చేయించారు. భక్తులు స్వామివారి ఉత్సవమూర్తిని తలపై ఉంచుకుని నీటిలో మునిగారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి చేర్చారు. మండలపూజల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు ఆలయ ఆవరణలో మహాపడిపూజ నిర్వహించనున్నట్లు లక్ష్మిరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటనారాయణ, రామ్‌నారాయణ, చలపతి, ఏఎంసీ శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

← అయ్యప్పస్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న మాలధారులు

నేటి నుంచి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా శనివారం నుంచి ఆంధ్రా-మహారాష్ట్ర జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆర్డీటీ స్టేడియంలో జరుగుతుంది. ఇప్పటికే జిల్లాకు చేరుకున్న ఇరు జట్ల క్రీడాకారులు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేడియంలో నెట్ ప్రాక్టీస్ చేశారు. ఆంధ్రా హెడ్‌కోచ్ ఏపీ ప్రతాప్, మహారాష్ట్ర హెడ్ కోచ్ అజయ్‌చవాన్‌ల సమక్షంలో బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్ ఇలా అన్ని విభాగాల్లో సాధన చేశారు. మ్యాచ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. ఆంధ్రా జట్టుకు జిల్లా క్రీడాకారులు వీరారెడ్డి, జయంత్ కృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.



నెట్ ప్రాక్టీస్

తిమ్మమ్మను జాతీయస్మారకంగా గుర్తించాలి

అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్

అనంతపురం కల్చరల్/నంబులపూలకుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధించిన శ్రీసత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట మండలంలోని తిమ్మమ్మ మర్రిమానును జాతీయ స్మారకంగా గుర్తించాలని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్‌సింగ్ రావత్‌ను ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన తిమ్మమ్మ మర్రిమాను చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. తిమ్మమ్మ మర్రిమానుకు పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉన్నప్పటికీ అక్కడ కనీస సౌకర్యాలు లేక పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆ ప్రాంతాన్ని జాతీయస్మారకంగా గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ స్పందిస్తూ తిమ్మమ్మ మర్రిమాను అంశాన్ని కేంద్ర అటవీ పర్యావరణ శాఖకు రెకమెండ్ చేస్తామని హామీ ఇచ్చారు.



కేంద్ర పురావస్తుశాఖ డీజీ యదుబీర్‌సింగ్ రావత్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జాస్తి వీరాంజనేయులు

ఖ్చ.. వేస్ట్..

నిరుపయోగంగా మార్కెట్‌యార్డు



నిరుపయోగంగా మారిన మార్కెట్ యార్డు గోడౌన్

▸ యార్డులో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు
▸ రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్న రైతులు



పిచ్చి మొక్కల మధ్య మరుగుదొడ్లు

44వ జాతీయ రహదారిపై ఆరబోసిన వరిధాన్యం

రోడ్డుపైకి రావాల్సిందే



పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ధాన్యం ఆరబోయాలంటే జాతీయ రహదారులపైకి రావాల్సిందే. ఉన్న మార్కెట్‌యార్డును ఎవరు పట్టించుకోకపోవడంతో అందులో పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిగా మారింది. అధికారులు, నాయకులు స్పందించి మార్కెట్ యార్డును శుభ్రం చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– నరసింహులు, రైతు, ఇల్లూరు

గార్లదిన్నె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో మార్కెట్ యార్డు నిరుపయోగంగా మారింది. దీంతో రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పండించిన ధాన్యం అరబోసుకునేందుకు, నిల్వ ఉంచుకునేందుకు కొన్నేళ్ల కిందట కల్లూరు గ్రామం 44వ జాతీయ రహదారి పక్కన మార్కెట్ యార్డు, గోడౌన్‌లు, ప్లాట్ ఫాంలు నిర్మించారు. మండల రైతులతో గతంలో మార్కెట్ యార్డు నిత్యం కళకళలాడేది. మార్కెట్ యార్డులో ఎంతోమంది కూలీలకు ఉపాధి కూడా లభించేది. అయితే రానురాను మార్కెట్ యార్డుపై అధికారులు, పాలకులు శీతకన్ను వేయడంతో అది పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీంతో పండించిన ధాన్యాన్ని రైతులు జాతీయ రహదారిపై ఆరబోసుకుంటున్నారు. ఈక్రమంలోనే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి అధికారులు ప్రయాణిస్తారే తప్ప రైతుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. మార్కెట్ యార్డులోని గోడౌన్లను కూడా వ్యవసాయేతర పనులకు అద్దెకు ఇచ్చేశారు. కల్లూరులో మార్కెట్ యార్డు ఉందని పాలకులు, అధికారులకు తెలిసినా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. యార్డును బాగుచేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిని కోరినట్లు వారు పేర్కొన్నారు.

రైతులకు అనుకూలంగా మార్చాలి

కల్లూరులోని మార్కెట్‌యార్డును కోట్లాది రూపాయలతో రైతుల కోసం నిర్మించారు. కల్లూరు, ఇల్లూరు, కేశవాపురం, కొప్పలకొండ, కమలాపురం సిరివరం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు వరి పంటను సాగుచేశారు. అయితే పండించిన పంటను అమ్ముకోవాలంటే ధాన్యం ఆరబోసుకోవాలి. ధాన్యం తడిగా ఉంటే తక్కువరేటుకు కొంటారు. ధాన్యం అరబోసుకోవాలంటే స్థలం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డును రైతులకు అనుగుణంగా మార్చాలి.

– చెన్నారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి



వినియోగంలోనే ఉంది

కల్లూరు మార్కెట్‌యార్డు వినియోగంలోనే ఉంది. రైతులు కూడా వరి ధాన్యంను ఆరబోసుకుంటున్నారు. గోడౌన్లను ఎవరు వినియోగించుకోకపోవడంతో ఎలక్ట్రికల్ వారికి అద్దెకు ఇచ్చాం. నెలకు రూ.1.32 లక్షల అద్దె వస్తోంది.

– కేధార్‌నాథ్, నియోజకర్గం మార్కెట్ యార్డు కార్యదర్శి

మార్కెట్‌యార్డును వినియోగంలోకి తేవాలి



రైతులకు ప్రయోజనం చేసేందుకు గత ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మార్కెట్‌యార్డును నిర్మిస్తే కొందరు అధికారులు వాటిని రైతులకు కాకుండా వ్యాపారులకు అద్దెకు ఇవ్వడం ఏంటి. మార్కెట్‌యార్డును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చి రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనాథ్‌చౌదరి, ఏఐవైఎఫ్

అభివృద్ధి పనులు వేగంగా చేయండి

సీఎఫ్ యశోదాబాయి

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) అనంతపురం సర్కిల్ పరిధిలోని అటవీశాఖలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సీఎఫ్ (కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) యశోదాబాయి ఆదేశించారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలోని డీఎఫ్ఓ చాంబర్‌లో శుక్రవారం ఆమె సర్కిల్ పరిధిలోని డీఎఫ్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే అనుమతులు పొంది ప్రారంభించిన అభివృద్ధి పనులకు సంబంధించి జిల్లాల వారిగా ఆరా తీశారు. చేస్తున్న పనుల్లో లోపాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద అనుమతులు పొంది ప్రారంభించిన పనుల్లో పురోగతి ఉండేలా చూసుకోవాలి ఆదేశించారు. ఎదురయ్యే సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారమార్గాలు చూపాలన్నారు. సమావేశంలో అనంతపురం డీఎఫ్ఓ విఘ్నేష్, శ్రీ సత్యసాయి జిల్లా డీఎఫ్ఓ చక్రపాణి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వినోద్‌కుమార్, చిత్తూరు డీఎఫ్ఓ భరణి, పెనుకొండ సబ్‌డీఎఫ్ఓ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న సీఎఫ్ యశోదాబాయ్

మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

■ డీఈఓకు ఎస్టీయూ నేతల వినతి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తప్పులు సవరించి ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న మున్సిపల్ టీచర్లకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని ఎస్టీయూ నాయకులు డీఈఓను కోరారు. ఆ సంఘం నాయకులు డీఈఓ ప్రసాద్‌బాబును శుక్రవారం ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఖాళీలను ప్రమోషన్లతో భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక కారణాలతో ప్రమోషన్లు జరగలేదన్నారు. తాజాగా ఇస్తున్న ప్రమోషన్లలో 70:30 నిష్పత్తిలో రోస్టర్ పాయింట్లు లెక్కించి, ఖాళీలు భర్తీ చేయాలన్నారు. తెలుగు,హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ సబ్జెక్టుల సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలన్నారు. తాత్కాలిక సీనియారిటీ జాబితాల్లోని తప్పులను సవరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సూర్యుడు, ఫణిభూషణ్, అజయ్‌కుమార్, మల్లికార్జున, గంగాధర్,శ్రీనివాసరెడ్డి, కరీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు.. అధికారుల బేజారు..!

వైసీపీ హయాంలో భారీ అక్రమాలు

రూర్బన్‌లో అవినీతిపై లోకాయుక్తకు ఫిర్యాదు

నిత్యం తనిఖీలతో బెంబేలు

12 పంచాయతీలకు ఇద్దరే కార్యదర్శులు

ఖాళీ కాబోతున్న ఎంపీడీఓ కార్యాలయం



ఖాళీగా కనిపిస్తున్న ఎంపీడీఓ సీటు

కళ్యాణదుర్గం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జరిగిన అక్రమాలతో ప్రస్తుతం అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఎవరు తనిఖీలకు వస్తారో.. ఏ రికార్డులు అడుగుతారోనని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సతమతమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ తరహా మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2016లో శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని కంబదూరు మండలాన్ని ఎంపిక చేశారు. కేంద్రం 30 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 70 శాతం నిధులు కేటాయించేలా మార్గదర్శకాలు రూపొందించారు. మండలంలోని 12 పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ. 127 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. దాదాపు రూ. 100 కోట్ల వరకు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. ఈ పనుల్లో వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడ్డారు. రూ.కోట్లల్లో అవినీతి జరిగిందని 2020లో లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. ఆ మేరకు విచారణ అధికారిగా డీఎస్పీ కోలార్‌క్రిష్ణ వచ్చి 12 పంచాయతీల్లో జరిగిన పనులపై తనిఖీలు చేపట్టారు. క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్, జిల్లా అధికారులు...ఇలా పలు విభాగాల అధికారులు వచ్చి తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారుల అవినీతి పాపానికి మా కేంటి ఈ ఖర్మ అంటూ ఈ కార్యాలయంలో పనిచేయడానికి భయపడుతున్నారు. పరిస్థితి చూస్తుంటే కంబదూరు మండల పరిషత్ కార్యాలయం అంతా ఖాళీ అవుతున్నట్లు తెలుస్తోంది. మండల అభివృద్ధికి కీలకమైన మండల పరిషత్తు కార్యాలయంలోనే సిబ్బంది కొరత వెంటాడుతోంది.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోనే దిక్కు

కంబదూరు మండల పరిషత్ కార్యాలయానికి ఇన్‌చార్జ్ ఎంపీడీవోనే దిక్కుగా మారారు. కళ్యాణదుర్గం ఎంపీడీవో రామచంద్రను కంబదూరుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. రెండు మండలాల్లో పనిచేయాలంటే ఆయనకు తలనొప్పిగా మారింది. కళ్యాణదుర్గం ఎంపీడీవోగానే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని, కంబదూరు ఇన్‌చార్జ్ వద్దు అంటూ ఉన్నతాధికారులకు విన్నవించినట్లు తెలిసింది. కార్యాలయ ఏవో కూడా అనారోగ్యంతో సెలవులో వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈవోఆర్డీగా గూడెన్న రెండు నెలల క్రితమే మండలానికి వచ్చారు. ఇక్కడ జరిగిన పనులపై సమగ్రంగా నివేదికలు చూపించలేక సతమతమవుతున్నట్లు తెలిసింది. ఈయన కూడా త్వరలోనే పదవీ విరమణ చేయనున్నారు.



కంబదూరు మండల పరిషత్ కార్యాలయం

అన్నింటిలోనూ అక్రమాలే....

కంబదూరు మండలంలోని 42 గ్రామాల్లో అండర్ గౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి పైపులైన్లు, ఘన వ్యర్థాల నిర్వహణ, స్థానిక నిరుద్యోగులు, మహిళలకు ఉపాధి శిక్షణ, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల నిర్మాణం వంటి పనులు చేపట్టారు. ప్రతి పనిలోనూ అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ అధికారులు గుర్తించారు. ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు కుమ్మక్కై సుమారు రూ. 25 కోట్ల వరకు అవినీతి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

12 పంచాయతీలకు ఇద్దరే కార్యదర్శులు

కంబదూరు మండలంలో 12 పంచాయతీలు ఉన్నాయి. ఇద్దరు కార్యదర్శులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అపార్ కష్టాలతో సతమతమవుతున్న విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శుల కొరతతో అస్తవ్యస్తంగా మారిపోయింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు గ్రామీణులు సతమతమవుతున్నారు. మండల అభివృద్ధిలో కీలకమైన పంచాయతీ కార్యదర్శుల కొరతతో పాలన అస్తవ్యస్తంగా మారింది.

సంపద సృష్టి జరిగేనా..?

చెత్తతో సంపద తయారీ కేంద్రాలపై నిర్లక్ష్యం

● లక్షలు ఖర్చు చేసినా.. నిష్ప్రయోజనం

● కూటమి ప్రభుత్వంపై గ్రామీణుల ఆశలు

రాయదుర్గం రూరల్, డిసెంబరు 20: అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో సంపద సృష్టి ఏమో గాని, ప్రజా ధనం చెత్తలో కలిసిపోతోంది. గత టీడీపీ పాలన(2014-19)లో లక్షలాది రూపాయలు వెచ్చించి చెత్తతో సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. చెత్త సేకరణకు ప్రతి కేంద్రానికి ఇద్దరి నుంచి ఐదుగురు కార్మికుల(క్లాప్‌మిత్ర)ను నియమించారు. వీరు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, దాన్ని రీసైక్లింగ్ చేసి ఎరువుగా మార్చి తక్కువ ధరకు రైతులకు అందించాలి. ఇందుకు ఒక్కొక్క కార్మికుడికి నెలకు రూ. ఆరు వేలు జీతం ఇచ్చేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా గాలికి వదిలేయడంతో కొన్ని చోట్ల సంపద తయారీ కేంద్రాలు దిష్టిబొమ్మలుగా మారాయి. ఇంటింటి నుంచి చెత్త సేకరించడానికి ప్రభుత్వం అందించిన సైకిళ్లు తుప్పుపట్టిపోయాయి.



తుప్పు పట్టిన మూడు చక్రాల వాహనం

జీతాలు సక్రమంగా రాకపోవడంతో క్లాప్ మిత్రులు చెత్త సేకరణకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందుకు గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తుప్పు పట్టిన వాహనాలు

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి మండలంలోని ఆవులదట్ల, కొంతానపల్లి, 74 ఉడేగోళం, చదం, ఆర్‌బీవంక గ్రామాలను గత టీడీపీ ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ క్రమంలోనే మండలంలోని 19 పంచాయతీల్లో 19 చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో పని చేసేందుకు 69 మంది క్లాప్‌మిత్రులు, 19 మంది షెడ్ మిత్రులను మొత్తం 88 కార్మికులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి నిత్యం క్లాప్ మిత్రులు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి ఆ చెత్తను సంపద కేంద్రానికి తరలించి, రీసైక్లింగ్ చేసి ఎరువుగా మార్చాలి. ఆ ఎరువును రైతులకు అమ్మి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వాడటం ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. అయితే గత ఐదేళ్లతో వైసీపీ ప్రభుత్వం ఈ సంపద నిర్మితి కేంద్రాలను గాలికొదిలేసింది. దీంతో చాలా కేంద్రాల వద్ద చెట్లు పెరిగాయి. వాహనాలు నిరుపయోగంగా మారాయి. ఏళ్ల తరబడి వాహనాలు వాడకపోవడంతో తుప్పు పట్టిపోయాయి. ప్రస్తుతం వాటిని వాడుకోవాలన్నా ఉపయోగపడే పరిస్థితులు లేవు.



నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

ఐదేళ్లుగా గాలికి వదిలేశారు



గత వైసీపీ ప్రభుత్వం చెత్తతో సంపద తయారీ కేంద్రాల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం అందులో పని చేసే వారికి కూడా సక్రమంగా జీతాలు ఇవ్వలేదు. దీంతో కొంతమంది పారిశుధ్య కార్మికులు చెత్తసేకరణకు రావడం మానేశారు. ఈ సమస్యపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టి చెత్తతో సంపద తయారీ కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలి.

– రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్, గ్రామదట్ల

ప్రత్యేక దృష్టి



రాష్ట్ర ప్రభుత్వం చెత్తతో సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. నిరుపయోగంగా ఉన్న ఈ కేంద్రాలను త్వరలో వాడుకలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం. వాహనాలకు మరమ్మతులు చేపట్టి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసేలా చూస్తాం.

– కొండన్న, ఎంపీడీఓ

జిల్లా జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్ శుక్రవారం జిల్లా జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడారు. ఆహారం, నివాసం, ఆరోగ్య స్థితిగతులు, జైలు అధికారుల ద్వారా అందజేస్తున్న సౌకర్యాల గురించి ఖైదీలతో విచారించారు. న్యాయ సేవల లభ్యత, అప్పీల్ హక్కు, ప్లీ బేరసారాలు, న్యాయ సహాయం గురించి ఖైదీలకు తెలియజేశారు. అనంతరం ఓపెన్ ఎయిర్ జైలు, ప్రభుత్వ బాలుర అబ్జర్వేషన్ హోమ్‌ను సందర్శించారు.

అదృశ్యమైన వారి గుర్తింపులో నిర్లక్ష్యం తగదు

గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో మిస్సింగ్ సిటిజన్స్ గుర్తింపులో నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు తప్పవని గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ జిల్లా అధికారులను హెచ్చరించారు. కమిషనరేట్ నుంచి శుక్రవారం జిల్లా అధికారులతో ఆయన జూమ్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. డీపీఓ నాగరాజనాయుడు సంబంధిత సిబ్బందితో కలిసి తన చాంబర్‌లో జూమ్‌మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డుల్లో మిస్సింగ్ సిటిజన్స్ గుర్తింపుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కమిషనర్ ఆదేశించినట్లు తెలిపారు. ఆధార్ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కూడా సూచించినట్లు పేర్కొన్నారు. ఈక్రమంలోనే జిల్లాలో చాలా వరకు అన్ని పనులు పూర్తి చేశామని, పెండింగ్ ఉన్నవాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని చెప్పినట్లు డీపీఓ వెల్లడించారు.

క్రైం కార్నర్

బైకును ఢీకొన్న ట్రాక్టర్.. ఒకరి మృతి

బెళుగుప్ప, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లి గేట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం ట్రాక్టర్ బైకు ఢీకొనడంతో శ్రీరంగాపురానికి చెందిన తిమ్మప్ప (44) మృతి చెందాడు. గుండ్లపల్లి నుంచి వరిగడ్డి వేసుకుని ఓ ట్రాక్టర్ బెళుగుప్పకు వస్తుండగా, బెళుగుప్ప నుంచి స్వగ్రామానికి బైకులో బయల్దేరాడు. అయితే నక్కలపల్లి గేట్ వద్దకు రాగానే ట్రాక్టర్ ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తిమ్మప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య కళావతి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బియ్యం స్వాధీనం

అనంతపురం న్యూటౌన్/బత్తలపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. బత్తలపల్లి సమీపంలోని పాల డెయిరీ వద్ద జాతీయ రహదారిపై విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఓ వాహనంలో కర్ణాటకకు తరలిస్తున్న 62 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం యజమాని మహేష్, కొనుగోలుదారుడు నరేష్, డ్రైవర్ సతీష్, సహాయకుడు అశ్వత్థనారాయణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి, పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామని తెలిపారు. తనిఖీల్లో డీసీటీఓ సురేష్ కుమార్, బత్తలపల్లి సీఎస్‌డీటీ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడు టిప్పర్ల పట్టివేత

పెనుకొండ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వెళ్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు కియ పోలీసు స్టేషన్ ఎస్ఐ రాజేష్ తెలిపారు. టిప్పర్లు అధికంగా కంకర లోడ్ చేసుకుని, వెళ్తుండగా కియ పోలీసు స్టేషన్ సమీపాన గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వాటిని ఆర్టీఓకు అప్పగించారు. అధిక లోడ్ ఉన్నట్లు గుర్తించి జరిమాన విధించారు. శుక్రవారం సాయంత్రం జరిమానా చెల్లించడంతో వదిలేశారు. ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య వ్యవహారం కారణంగానే టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిసింది.

కానిస్టేబుల్ అసభ్య ప్రవర్తన

తాడిపత్రి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ యువతి పట్ల ఓ కానిస్టేబుల్ అసభ్యంగా ప్రవర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కానిస్టేబుల్ తీరుపై ఆగ్రహించిన తోటి ప్రయాణికులు దేహశుద్ధి చేసేందుకు ప్రయత్నించగా, బాత్రూంలోకి వెళ్లి దాక్కున్నట్లు తెలిసింది. ఆ కానిస్టేబుల్ బాత్రూం నుంచి గంటపాటు బయటకు రాలేదని సమాచారం. విజయవాడ కనకదుర్గమ్మ ఉత్సవాల బందోబస్తుకు ఆ కానిస్టేబుల్ గుత్తి నుంచి వెళుతూ.. గురువారం రాత్రి ఇలా వ్యవహరించాడని సమాచారం. ఎర్రగుంట్ల స్టేషన్‌లో బాధితురాలు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావించారని, తల్లిదండ్రులు నచ్చజెప్పడంతో వదిలేశారని సమాచారం.

యువకుడి హత్య


గిద్ద రాజు (ఫైల్)

కుందుర్పి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డే పాళ్యం గ్రామానికి చెందిన గిద్ద రాజు (32)గురువారం రాత్రి కర్ణాటక సరిహద్దులోని నాగేపల్లి గేటు సమీపాన హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు... గిద్దరాజు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఎప్పటిలాగే గురువారం కూడా కూలి పనులకు వెళ్లిన గిద్దరాజు సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల ఆరా తీశారు. అయితే కర్ణాటక ప్రాంతంలో శుక్రవారం గిద్దరాజు మృతదేహం పడి ఉండటం చూసి స్థానికులు కర్ణాటక పోలీసులకు సమాచారం అందించారు. పరశురాంపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడిని వడ్డేపాళ్యం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం పరశురాంపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హత్య జరిగిన ప్రాంతాన్ని చిత్రదుర్గ ఎస్పీ రంజిత్ భండార్, సీఐ హనుమంతప్ప పరిశీలించారు. పరశురాంపురం ఎస్ఐ బసవరాజు హత్య కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గిద్దరాజుకు ఏడాది కిందట ఈశ్వరమ్మతో వివాహం జరిగింది. వీరికి ఐదు నెలల పాప ఉంది.

ముగ్గురికి డెంగీ ?

శెట్టూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబలపంపల్లి గ్రామంలో హర్షిత అనే మూడేళ్ల చిన్నారికి డెంగీ సోకినట్లు డాక్టర్లు నిర్ధారించారని బాలిక కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అలాగే తిప్పేరుద్ర అనే వ్యక్తికి, మరో ఇద్దరు చిన్నారులకు కూడా డెంగీ లక్షణాలు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. గత కొన్ని రోజులుగా జ్వరం వస్తుండటంతో స్థానికంగా వైద్యం చేయించుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో వారు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు డెంగీ సోకినట్లు నిర్ధారించారని బాధితులు పేర్కొన్నారు. గ్రామంలో అపరిశుభ్రత పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది, రోగాలు వ్యాపింపజేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వర పీడితులకు వైద్యసిబ్బంది సక్రమంగా వైద్యం అందించకపోవడంతో కూడా ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు స్పందించి గ్రామంలో అపరిశుభ్రతను తొలగించి వ్యాధుల బారిన పడకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అవినీతి... కొత్త పుంతలు..!

- ఫేనో అకౌంట్లు సృష్టించి బిల్లులు స్వాహా
- వంద రోజులు పని చేయకున్నా బిల్లులు
- దూర ప్రాంతాల్లో ఉన్న వారి పేరుతో రికార్డులు
- టెక్నాలజీతో రూ.కోటికిపైగా దోపిడీ
- సామాజిక తనిఖీలో తేలినా చర్యలు నిల్



విడపనకల్లు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవినీతి కొత్త పుంతలు తొక్కింది. కొందరు అక్రమార్కులు ఫేనో అకౌంట్లు సృష్టించుకుని, బోగస్ జాబ్ కార్డులతో 100 రోజులు పనులు చేసినట్లు చూపి ప్రజాధనం కాజేశారు. ఇలా 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.కోటికిపైగా స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీల్లో జిల్లా అధికారులు తేల్చారు. అయితే 15 రోజులైనా ఏ ఒక్కరి పైనా చర్యలు తీసుకోలేదు. ఆర్ఆర్ యాక్ట్, క్రిమినల్ కేసులు పెడతామని సామాజిక తనిఖీలో అధికారులు చెప్పిన మాటలు ఉత్తుత్తివయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

టెక్నాలజీతో మాయ

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విడపనకల్లు మండలంలో ఉపాధి సిబ్బంది టెక్నాలజీని ఉపయోగించి ఫేనో అకౌంట్లు సృష్టించారు. బిల్లులు ఖాతాలో పడగానే వాటిని డిలిట్ చేశారు. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలో ఉద్యోగాలు చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర ప్రాంతాల వాళ్లు విడపనకల్లు మండలంలోకి వచ్చి ఉపాధి పనులు చేసినట్లు రికార్డులు సృష్టించారు. కంప్యూటర్ ఆపరేటర్ సుభాన్, పాల్తూరు ఫీల్డ్ అసిస్టెంట్ గురుస్వామి, జనార్దనపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ వడ్డే జానకీరాముడు, కరకముక్కల ఫీల్డ్ అసిస్టెంట్ రామస్వామి, ఆర్ కొట్టాల ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథలు తమ తెలివికి పని చెప్పి అన్ని మార్గాల్లో నిధులు కాజేశారు. ఉపాధి హామీ పథకం సీఓ చేతిలో ఉండాల్సిన లాగిన్ పాల్తూరు, జనార్దనపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌ల చేతిలోకి వెళ్లటం వల్ల ఇష్టారాజ్యంగా బిల్లులను కాజేశారు.


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

పాల్తూరులోనే రూ.28 లక్షల అవినీతి

పాల్తూరు గ్రామంలో 35 మంది జగనన్న ఇళ్లను నిర్మించుకుంటే వారికి ఇవ్వాల్సిన ఉపాధి బిల్లులను ఆ గ్రామంలో లేని వారి అకౌంట్లుకు వేసి దాదాపుగా రూ. 8.5లక్షలు కాజేశారు. జాబ్ కార్డుల్లో పనులు చేయని వారికి ఫేనో అకౌంట్లు క్రియేట్ చేసి వారు 100 రోజులు పనులు చేసినట్లు రికార్డులు సృష్టించి దాదాపుగా రూ. 12లక్షలు కాజేశారు. జాబ్ కార్డులో హిందూ మహిళా జానుశ్రీ అనే పేరు ఉంటే ఆ కార్డులో ముస్లిం పేర్లను చేర్చి ఫేనో అకౌంట్ల ద్వారా వంద రోజులకు బిల్లులు వేశారు. అనంతరం వారి పేర్లను తొలగించారు. ఇలా ఒక్క పాల్తూరు గ్రామంలోనే దాదాపుగా రూ. 28లక్షలు అవినీతికి పాల్పడ్డారు. పాల్తూరులో 1115 జాబ్ కార్డులును మంజూరు చేశారు. కానీ 562 జాబ్ కార్డులకు చెందిన వారు మాత్రమే పనులకు వెళ్తున్నట్లు రికార్డులు చేశారు. మిగిలినవి దొంగ మస్టర్లతో ఉపాధి బిల్లులు మంజూరు చేసుకున్నారు. సోషల్ ఆడిట్ వారికి రికార్డులు ఇవ్వకుండా, అన్నీ కాలువలో కొట్టుకు పోయాయని మాయ చేశారు. ఆన్ లైన్‌లో తనిఖీలు చేయగా అన్ని దొంగ జాబ్ కార్డులుగా తేలినట్లు తెలిసింది. కేసులు నమోదు చేస్తామని అధికారుల బెదిరించటంతో అప్పటికప్పుడు జాబ్ కార్డులు, మస్టర్ల జిరాక్స్‌లు తెచ్చి అధికారులు ఎదురుగానే కూలీలతో సంతకాలు చేయించి ఇచ్చారు.

ఎవరికీ అనుమానం రాకుండా...

ఫేనో అకౌంట్లతో పాటు ఎవరికి అనుమానం రాకుండా వివిధ బ్యాంక్‌లకు ఉపాధి బిల్లులు మంజూరు చేసి డబ్బులు డ్రా చేసుకున్నారు. ఐడీబీ, కెనరా, ఫేనో, ఎస్‌బీఐ, ఓవర్సీస్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇలా వివిధ రకాల బ్యాంక్‌లకు బిల్లులు మళ్లించి రూ. కోటికి పైగా కొల్లగొట్టారు.

ఇలా మొత్తం రూ. కోటికిపైగా అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల్లో తేల్చారు. ఇంత అవినీతి జరుగుతున్నా అప్పటి ప్రోగ్రాం అధికారి, ఏపీఓ, టీఏలు, అందరూ కళ్లు మూసుకుని రికార్డుల్లో సంతకాలు చేశారా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఇంత అవినీతి జరిగితే జిల్లా అధికారులు ఏ ఒక్కరిపైనా ఇప్పటికి చర్యలు చేపట్టలేదు. కనీసం కేసులుకూడా పెట్టకపోవటంలో ఆంతర్యం అంటుబట్టకుండా ఉంది. ఇంత అవినీతి జరిగినా, ఒక్క రికార్డు లేకుండా మాయం చేసినా అక్రమార్కులను కాపాడేందుకు జిల్లా, మండల స్థాయిలో అధికారులు ప్రయత్నిస్తుండటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

గ్రామాల వారిగా అవినీతి

పాల్తూరు	రూ.28లక్షలు
వేల్పుమడుగు	రూ.8.30లక్షలు
కడదరబెంచి	రూ.2.12లక్షలు
డొనేకల్లు	రూ.4.92లక్షలు
గడేకల్లు	రూ.98వేలు
హావళిగి	రూ.1.24లక్షలు
కొట్టాలపల్లి	రూ.5.82లక్షలు
అంచనహాలు	రూ.13వేలు
వీ కొత్తకోట	రూ.13వేలు
మాళాపురం	రూ.2.15లక్షలు.
ఆర్ కొట్టాల	రూ.1.59లక్షలు
విడపనకల్లు	రూ.7.42లక్షలు
చీకలగురికి	రూ.4.48లక్షలు
జనార్దనపల్లి	రూ.4.08లక్షలు
కరకముక్కల	రూ. 12.79లక్షలు
ఉండబండ	రూ.8.79లక్షలు
పొలికి	రూ.25.81లక్షలు

హంద్రీనీవా లైనింగ్‌తో నష్టం

- కాలువను వెడల్పు చేయండి
- జలసాధన సమితి డిమాండ్


హంద్రీనీవా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జలసాధన సమితి నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్‌తో జిల్లా రైతాంగానికి తీవ్రనష్టం కలుగుతుందని, ఆ పనులను వెంటనే ఆపాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. లైనింగ్ వేయడానికి బదులుగా కాలువను వెడల్పు చేయాలని కోరారు. హంద్రీనీవా ప్రయోజనాలకు సమాధి కట్టే 404, 405 జీఓలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జలవనరుల శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సాగునీటిరంగ నిపుణులు ఎస్ఎం బాషా, రచయిత శాంతి నారాయణ, జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓలు హంద్రీనీవా ప్రాజెక్ట్ ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని, రాయలసీమ ప్రజలకు తీవ్రనష్టం కలిగించే ఆ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమలోని ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు, జిల్లాలో ఉన్న 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూపకల్పన చేసిన హంద్రీనీవా ప్రాజెక్టను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. హంద్రీనీవా ప్రధాన లక్ష్యం ప్రకారం మల్యాల నుంచి జీడిపల్లి వరకు 10 వేల క్యూసెక్కులు, జీడిపల్లి నుంచి గొల్లపల్లి వరకు 6 వేల క్యూసెక్కులు, గొల్లపల్లి నుంచి మారాల వరకు 5వేల క్యూసెక్కులు, మారాల నుంచి చెర్లోపల్లికి 4500 క్యూసెక్కులు, మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు 1500 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలవను వెడల్పు చేయాలని కోరారు. శ్రీశైలం నుంచి తెచ్చుకున్న కృష్ణా జలాలను నిల్వ చేసుకోవడానికి అవసరమయ్యే ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీలను వెంటనే నిర్మించి జిల్లాను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతుసంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సీపీఎం నాయకుడు మల్లికార్జున, అఖిలభారత రైతుసంఘాల నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వివిధ సంఘాల నాయకులు కృష్ణ, సురేష్, యేసు, పెద్దన్న, వీరనారప్ప, చంద్ర, వెంకటేష్, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తులను బాధితులకు పంచాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

పుట్లూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను డిపాజిటర్లకు పంచిపెట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కడవకల్లు-చెర్లోపల్లి గ్రామాల మధ్యన ఉన్న అగ్రిగోల్డ్ భూములను రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో 32 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని అన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు రూ.6300 కోట్లు ఉన్నా డిపాజిటర్లకు న్యాయం చేయడం లేదని విమర్శించారు. న్యాయం జరగకపోవడంతో చాలామంది నిరుపేదలు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం రూ.900 కోట్ల పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఏడు వేల ఎకరాల అగ్రిగోల్డ్ భూములను సీఐడీ అటాచ్ చేసిందని, వాటిని అమ్మి బాధితులకు సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. పుట్లూరు మండలంలో 210 ఎకరాల విలువైన భూమిని వైసీపీ నాయకుడు సాగుచేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వంద ఎకరాలకు పైగా భూముల్లో గుట్టుగా పంటలు ఎలా సాగుచేశారని మండిపడ్డారు. పేదలకు చెందాల్సిన భూములను వైసీపీ నాయకులు సాగు చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్రాంతిలోపు ఆ భూములను ఖాళీ చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ భూములు అమ్మి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు అగ్రి గోల్డ్ భూములలో పంటలను పరిశీలిస్తుండగా పోలీసులు వచ్చి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో పోలీసులపై సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము దొంగతనంగా రాలేదని, అగ్రిగోల్డ్ బాధితుల తరఫున వచ్చామని అన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని, ఇంతవరకు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణస్వామి, తిరుపతి రావు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కుళ్లాయప్ప, సిద్దేశ్వర, జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప, మండల కార్యదర్శి పెద్దయ్య, రైతు సంఘం నాయకుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


అగ్రిగోల్డ్ భవనం వద్ద మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకులు

దంపతుల ఆత్మహత్య


మృతిచెందిన గోవిందరెడ్డి, జ్యోతి

పావగడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో పట్టణంలోని వైఈఆర్ రంగయ్యశెట్టి డిగ్రీ కళాశాల వెనుకవైపున శుక్రవారం దంపతులు గోవిందరెడ్డి, జ్యోతి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోవిందరెడ్డిది అనంతపురం జిల్లా కుందుర్పి మండలం వెంకటంపల్లి. అతడికి లక్ష్మీతో వివాహమైంది. 20 ఏళ్ల క్రితం బెంగళూరుకు వలస వెళ్లి అక్కడే ఉంటున్నారు. అక్కడ జ్యోతితో పరిచయమై, ఆమెను కొన్నేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో గోవిందరెడ్డి, జ్యోతి గురువారం రాత్రి పావగడకు వచ్చి, ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. శుక్రవారం ఉదయం మద్యం బాటిల్ తీసుకుని, అందులో విషం కలుపుకుని కళాశాల వెనకవైపునకు వెళ్లి తాగారు. కాసేపటికే జ్యోతి మృతిచెందింది. గోవిందరెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను ఏఎస్పీ మరియప్ప, డీఎస్పీ రామచంద్రప్ప, సీఐ సురేష్, ఎస్ఐ గురునాథ్, పరిశీలించారు. దంపతుల ఆత్మహత్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ కంచె తాకి వ్యక్తి మృతి

- తోట యజమానికి రెండేళ్ల జైలు శిక్ష

మడకశిరటౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తోటకు రక్షణగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి, వ్యక్తి మృతిచెందిన కేసులో యజమానికి జైలు శిక్ష పడింది. మండలంలోని బుడ్డయ్యపాళ్యం గ్రామానికి చెందిన బి.హనుమంతరాయప్ప 2019లో తన దానిమ్మ తోటకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడు. అదే గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి కంచె తాకి, విద్యుదాఘాతంతో మరణించాడు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును మడకశిర జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్ విచారించారు. హనుమంతరాయప్పపై నేరం నిర్ధారణ కావడంతో రెండేళ్లు కఠిన కారాగారశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ తెలిపారు.

మెప్మా అధికారి, ఆర్పీపై కేసు

ధర్మవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బోగస్ మహిళా సంఘాలతో రుణాలు కాజేశారన్న ఫిర్యాదు మేరకు మున్సిపాలిటీలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న టీఎంసీ వెంకటేశ్, ఆర్పీ శోభారాణిపై వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. 5 బోగస్ సంఘాలను సృష్టించి, వాటి ద్వారా రూ.కోటికిపైగా ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని, స్వాహా చేసినట్లు తెలుస్తోంది. దీనిపై బ్యాంకు మేనేజర్ జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

పరిటాల రవి హత్య కేసులో...
బెయిలుపై నలుగురు విడుదల


కడప సెంట్రల్ జైలు నుంచి బెయిలుపై విడుదలవుతున్న పరిటాల రవి హత్య కేసు ఖైదీలు

కడప క్రైం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత పరిటాల రవి హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న నలుగురు శుక్రవారం బెయిలుపై విడుదల అయ్యారు. 2005 జనవరి 25న అనంతపురంలో రవి హత్యకు గురయ్యారు. ఈ కేసులో 12 మందికి శిక్ష పడింది. నలుగురు కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. వీరికి హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. వీరి విడుదల సందర్భంగా కుటుంబ సభ్యులు కడప కేంద్ర కారాగారానికి చేరుకున్నారు. విడుదలైన వారిని వాహనాల్లో ఎక్కించుకుని సొంతూర్లకు వెళ్లారు. పరిటాల రవి హత్య కేసులో ముద్దాయిలు మద్దలచెరువు సూరి, మొద్దు శీను, కొండారెడ్డి, పటోళ్ల గోవర్ధనరెడ్డి చనిపోయారు. ఆరు నెలల క్రితం వన్నా హనుమంతురెడ్డి, వడ్డె శీను, పెద్దిరెడ్డి బెయిలుపై బయటకు వచ్చారు. ప్రస్తుతం కడప సెంట్రల్ జైలు నుంచి నారాయణరెడ్డి, ఓబిరెడ్డి, రంగనాయకులు, వడ్డె కొండ విడుదలయ్యారు. వైజాగ్ సెంట్రల్ జైలులో ఉన్న రేఖమయ్య కూడా విడుదల అయ్యారు. వీరంతా ప్రతి సోమవారం స్థానిక పోలీసుస్టేషనులో హాజరు కావాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా బెయిలుపై వచ్చిన వారిని మీడియా పలకరించే ప్రయత్నం చేయగా నారాయణరెడ్డి స్పందిస్తూ హైకోర్టు ఉత్తర్వులమేరకు ఈ విషయాలపై స్పందించబోమని అన్నారు. కారు ఎక్కి వెళ్లిపోయారు. అయితే 18 ఏళ్ల తరువాత బెయిలుపై విడుదలయ్యారంటూ వారి బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పగవాడికి కూడా ఇలాంటి కష్టాలు ఉండకూడదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఒలింపిక్స్‌లో భాగస్వామ్యమే సీఎం ధ్యేయం

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



గెలుపొందిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒలింపిక్స్‌లో రాష్ట్ర క్రీడాకారులను భాగస్వామ్యం చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలను ప్రోత్సహిస్తున్నారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన మూడురోజుల జోనల్ క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిశాయి. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ముగింపు పోటీలకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన జట్లకు ఆయన ట్రోఫీలను అందజేశారు. కళాశాల స్థాయిలోనే విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేలా కూటమి ప్రభుత్వం పోటీలను నిర్వహిస్తోందని అన్నారు. ఆటలలో గెలుపోటములు సహజమని, విజయం సాధించేదిశగా విద్యార్థులు కృషిచేయాలని సూచించారు. బాలికల విభాగంలో అనంతపురం కళాశాల విద్యార్థులు ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్, వాలీబాల్ పోటీల్లో విజయం సాధించారు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో పీవీకేకే, పరుగు పందెంలో అనంతపురం పాలిటెక్నిక్ కళాశాల క్రీడాకారులు విజయం సాధించారు. బాలుర విభాగంలో అనంతపురం, ధర్మవరం జట్లు విజయం సాధించాయి. విజయం సాధించిన జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

మూడు పుస్తకాలు.. విజ్ఞాన దీపికలు

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత రాచపాళెం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిర్భయ గొంతుకతో వి.రాంభూపాల్ చేసిన రచనలు విజ్ఞాన దీపికలుగా ఉపయోగపడుతాయని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ రచించిన మూడు పుస్తకాలను జిల్లా పరిషత్ నూతన హాల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'రైతును ముంచుతున్న పాలకుల విధానాలు' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, 'విద్వేష రాజకీయాలు' పుస్తకాన్ని ఆచార్య రాచపాళెం, 'అసమానతలు.. ఆర్థిక విధానాలు' పుస్తకాన్ని బడ్జెట్ విశ్లేషకుడు సత్యబోస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచపాళెం మాట్లాడుతూ... ప్రశ్నించడమే నేరమైపోతున్న రాజకీయ వ్యవస్థలో నిజాన్ని నిర్భయంగా చెప్పడమే పెద్ద సాహసమైందని అన్నారు. ఎన్నికల సమయంలో అసాధారణ హామీలు ఇచ్చి, అధికారంలోకి రాగానే ప్రజల్ని అణచివేయడం పాలకులకు అలవాటుగా మారిందని అన్నారు. ప్రజలంటే చులకన, సంపన్నులంటే ఆలింగనం అని రుజువు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భంలో రాంభూపాల్ రోజువారీ ప్రజాసమస్యలపై ఉద్యమిస్తూనే, సమకాలీన ఆర్థిక రాజకీయ, సామాజిక పరిస్థితులపై అనేక వ్యాసాలు రాస్తున్నారని అన్నారు. మార్పు రావడం అంటే పార్టీలు, ప్రభుత్వాలు మారడం కాదని, అవి అనుసరించే విధానాలు మారాలని తన రచనలద్వారా బలమైన ప్రత్యామ్నాయ అవసరాన్ని చాటిచెప్పారని అభినందించారు. వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వం తెస్తున్న చట్టాలు, కార్పొరేట్ అనుకూల విధానాలు మన జిల్లా రైతులపై చూపే దుష్ప్రభావాన్ని రాంభూపాల్ కళ్లకు కట్టినట్లు చూపించారని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. నీటికోసం ఒకవైపు జనం ఎదురుచూస్తుంటే.. మరోవైపు పాలకుల నిర్లక్ష్యం వల్ల వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోందని అన్నారు. గిట్టుబాటు ధరలు అందని రైతాంగం అప్పుల్లో కూరుకుపోతుంటే, దళారులు సంపన్నులవుతున్న తీరును రాంభూపాల్ తన రచనల్లో సమగ్రంగా వివరించారని అన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అత్యధికమంది ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నాయని సత్యబోస్ అన్నారు. ఓవైపు దేశం అభివృద్ధి చెందిందని అంటున్నారని, మరోవైపు పేదలు సంక్షేమ పథకాలకోసం పేదలు ఎగబడుతున్నారని.. పాలకుల మాటలకు, ఆచరణకు ఉన్న వ్యత్యాసాన్ని ఇవి కళ్లకు కడుతున్నాయని అన్నారు. దళితులు, బలహీన వర్గాలవారి జీవితాలు ఎలా దుర్భరమవుతున్నాయో రాంభూపాల్ తన రచనల్లో సోదాహరణంగా వివరించారని అన్నారు. యువత, విద్యార్థులు ఈ పుస్తకాలను విస్తృతంగా అధ్యయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఓబులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, న్యూడెమోక్రసీ నాయకులు ఏసురత్నం, అడ్వకేట్ రామకృష్ణారెడ్డి, తరిమెల అమరనాథరెడ్డి, చంద్రశేఖర్, జయరామప్ప, శేకన్న, గోవిందరాజులు, నబీరసూల్, కేవీ రమణ, రాంకుమార్, డాక్టర్ ప్రసూన, వేణుగోపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, సావిత్రి, నాగేంద్ర, బాలరంగయ్య, నగర కార్యదర్శి రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.


'అసమానతలు.. ఆర్థిక విధానాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బడ్జెట్ విశ్లేషకుడు సత్యబోస్ తదితరులు

సంక్షిప్తం

కురుబ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు



శ్రీనివాసులుకు నియామకపు ఉత్తర్వులు ఇస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కురుబ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కురుబ సంఘం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల కృష్ణయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బ్యాళ్ల నాగేంద్ర ఆయనకు నియామకపు ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విటల్ గౌడ్, నరేష్, వీరేష్ పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారయత్నం

రామగిరి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు... మహిళ గురువారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉండగా నరసింహులు అనే వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నరసింహులు మద్యం సేవిస్తూ గ్రామంలో మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవాడని గ్రామస్థులు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

అనంతపురం రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లిలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఓం శ్రీ అదితి ఆలయ ట్రస్టు ద్వారా విద్య అచ్యుతనందస్వామి రూ.10వేలు విరాళం ఇచ్చారు. శుక్రవారం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి సర్పంచ్ శివశంకర్‌కు విరాళాన్ని అందజేశారు.

బాధితుడికి పరామర్శ

అనంతపురం అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్న ధర్మవరం నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు లక్ష్మీనారాయణను నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడియాల కొండన్న పరామర్శించారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు రామాంజనేయులు, రామకృష్ణ, అక్కమ్మ, సురేంద్రతో కలిసి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స పొందిన లక్ష్మీనారాయణను పరామర్శించి ధైర్యం చెప్పారు.

నేడు అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని ఒకటోరోడ్డులో ఉన్న కాశీ విశ్వేశ్వరదేవాలయంలో ఉదయం 6గంటలకు నిర్వహించనున్నట్లు వివేకానంద యోగాకేంద్రం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 10 సంఘాల ప్రతినిధులు ఐక్యంగా అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు.

సైనికుల పిల్లలకు ఉచితంగా మందులు



బింగి విజయ్

నార్పల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సైనికుల పిల్లలకు ఉచితంగా మందులు అందిస్తామని మండల కేంద్రమైన నార్పలలోని వెంకటేశ్వర మెడికల్ స్టోర్ నిర్వాహకుడు బింగి విజయ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు తోటి సిబ్బంది 30 మంది ప్రాణాలు కాపాడి దేశ సేవలో అసువులు బాసిన వీర జవాన్ సుబ్బయ్య భార్య, పిల్లలతో పాటు.. దేశ సేవలో ఉన్న సైనికుల పిల్లలు ఎవరైనా సరే గుర్తింపు కార్డు చూపిస్తే తన మెడికల్ స్టోర్‌లో ఉచితంగా మందులు ఇస్తానని ఆయన తెలిపారు.

ఎరుకుల సంక్షేమానికి కృషి

కనగానపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎరుకుల కులస్థుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎన్‌టీఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేపకుంట గ్రామానికి చెందిన గడ్డం నారాయణ నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి అభివృద్ధికి పాటుపడుతా అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకలపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా దాని పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ సోమశేఖర్ తెలిపారు. ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇటుకలపల్లి, చియ్యేడు, కందుకూరు, పూలకుంట, క్రిష్ణంరెడ్డిపల్లి, మన్నీల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

కనగానపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తగరకుంట గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి వైద్యాధికారులు సుధాకర్, సునీల్‌కుమార్, ప్రియదర్శిని శుక్రవారం ప్రత్యేక గర్భకోశ చికిత్సా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులలో చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు. పెయ్య దూడల పుట్టుకకు ప్రభుత్వం ఉచితంగా సూదులు, మందులు అందిస్తోందని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు.

ఉపాధి బిల్లులు వెంటనే చేయాలి : ఏపీడీ

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులకు వెంటనే బిల్లులు చేయాలని ఏపీడీ వెంకటచలపతి సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లతోటల కింద మంజూరైన రైతులు వెంటనే మొక్కలు నాటుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుమునుపు చిన్నప్పేట గ్రామంలో పండ్లతోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకరప్ప, ఏపీఓ గోవిందరాజునాయక్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాలలో వసూలు రాజా..!

● విద్యార్థుల అడ్మిషన్లలో దోపిడీ ● సర్టిఫికెట్ల జారీలోనూ దందా ● గార్లదిన్నె మైనార్టీ పాఠశాలలో ఓ అధికారి తీరు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పి పేద విద్యార్థులకు అండగా నిలవాల్సిన ఆ అధికారి వసూలు రాజా అవతారం ఎత్తాడు. ప్రభుత్వ మైనార్టీ పాఠశాలలో ముస్లిం విద్యార్థుల నుంచి కాసుల దండుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఆ అధికారి తప్పులను ఎండగట్టే కొందరు ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇవన్నీ ఆ శాఖలోని అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో మరింత చెలరేగిపోతున్నట్లు అక్కడి ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గార్లదిన్నెలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో ఓ అధికారి తన బంధువు మధ్యవర్తిగా పెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నట్లు పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పేర్కొంటున్నారు. పాఠశాల అభివృద్ధి పనులు, టీచర్ల డ్యూటీలు, విద్యార్థుల అడ్మిషన్లు, సర్టిఫికెట్ల జారీలో.. ఇలా ప్రతిచోటా చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. తన దందాకు ఎవరైనా అడ్డొస్తే... తన కులాన్ని వాడుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అడ్మిషన్ల సమయంలో ఒక్కో విద్యార్థి నుంచి రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకూ వసూలు చేసినట్లు సమాచారం. ఈ ఏడాది అడ్మిషన్ల రూపంలోనే రూ. 10 లక్షల వరకూ వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ వసూళ్లపై ఎవరైనా ప్రశ్నిస్తే... పాఠశాల అభివృద్ధి కోసమంటూ చెప్పుకొస్తున్నట్లు తెలిసింది.

సర్టిఫికెట్ల జారీలోనూ చేతివాటం

పాఠశాల నుంచి ఉత్తీర్ణులై వెళ్లిపోయే 10వ తరగతి విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల జారీలోనూ ఆ అధికారి చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. 10వ తరగతి మార్కుల కార్డుకు రూ. 700, టీసీకి రూ. 1000 చొప్పున బలవంతంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఆ పాఠశాల నుంచి ఉత్తీర్ణత సాధించిన పలువురు విద్యార్థులు టీసీలు, మార్కుల జాబితా ఇవ్వాలని కోరగా.. తనకు అనుకూలంగా ఉన్న కొందరు ఉపాధ్యాయులను మధ్యవర్తులుగా వాడుకొని డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

అనుకూల టీచర్లకు అందలం

తన అక్రమ వసూళ్లకు ఏర్పాటు చేసుకున్న కొందరు టీచర్లను ఆ అవినీతి అధికారి అందలమెక్కించినట్లు సమాచారం. పాఠశాలలోని అభివృద్ధి పనులు, వసూళ్లు, ఆర్థిక లావాదేవీలకు వారిని వాడుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆ అధికారి అవినీతి ప్రశ్నించే పలువురు ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. అనవసరంగా నైట్ డ్యూటీలు వేయడం, సెలవు దినాల్లో డ్యూటీలు వేసి బలవతంగా రప్పిస్తున్నట్లు బాధిత ఉపాధ్యాయులు వాపోతున్నారు.



గార్లదిన్నెలోని మైనార్టీ గురుకుల పాఠశాల

పాఠశాల మార్పులోనూ నిర్లక్ష్యం

గార్లదిన్నె మండలంలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో సరైన వసతులు లేవు. ఊరు బయట ఉండడంతో చాలాకాలం నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్పు చేయాలని విన్నవిస్తున్నారు. ఇందుకు స్పందించిన రాష్ట్ర స్థాయి అధికారులు పాఠశాల భవనాన్ని అనంతపురం నగరానికి మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రానికి మారిస్తే.. తన ఆటలు సాగవనుకున్న ఆ అధికారి.. ఎక్కడా భవనాలు దొరకడం లేదని.. ఇక్కడే బాగుందని పైస్థాయి అధికారులకు చెప్పుకొచ్చినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఆ శాఖ జిల్లా అధికారులు ఆదేశాలిచ్చినప్పటికీ... వాటిని బేఖాతరు చేస్తూ పాఠశాల మార్పుపై నిర్లక్ష్యం వహిస్తున్నట్లు సమాచారం.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

గార్లదిన్నె, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, ఇతర రికార్డులు, లాకప్, కంప్యూటర్ గదిని పరిశీలించారు. పెండింగ్ కేసులకు సంబంధించిన సీడీలను పరిశీలించి వాటి పురోగతిపై ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌బాషాతో చర్చించి పలు సలహాలు ఇచ్చారు. నేరాలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల తనిఖీ సమయంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాలు, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి వారి జీవన విధానంపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని తెలిపారు. పోలీస్ సిబ్బందితో అప్పుడప్పుడు ముఖాముఖి మాట్లాడుతూ వారి విధుల గురించి తెలుసుకోవాలన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

తప్పుగా నమోదయిన సర్వే నంబర్లను సరిచేయండి



కొడిమిలో మాట్లాడుతున్న తహసీల్దార్ మోహన్‌కుమార్, గార్లదిన్నెలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఈరమ్మ

అనంతపురంరూరల్,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): తప్పుగా నమోదయిన సర్వే నెంబర్లను సరిచేయాలని కొడిమి గ్రామానికి చెందిన రైతులు రెవెన్యూ అధికారుల కోరారు. శుక్రవారం మండలంలోని కొడిమి గ్రామంలో తహసీల్దార్ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. గ్రామ పరిధిలో 14 ఫిర్యాదులు అందాయి. ఇందులో రస్తా సమస్యకు సంబంధించి ఆరు, భూముల సమస్యను పరిష్కరించాలని మరికొందరు రైతులు కోరారు. ఫిర్యాదుల క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించిత గడువులోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి రామాంజనేయులు, ఆర్‌ఐ సందీప్, వీఆర్వో రమేష్, సర్పంచ్ సుబ్బిరెడ్డి, టీడీపీ నాయకులు రవీంద్ర, ఎల్లప్ప, అనిల్ చౌదరి పాల్గొన్నారు.

గార్లదిన్నె : వివిధ భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వాటన్నింటిని పరిష్కారం చేస్తామని తహసీల్దార్ బండారు ఈరమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్లూరు, అగ్రహారం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. రెవెన్యూ సదస్సులో ఇచ్చిన ప్రతి అర్జీకి నిర్ణిత గడువులోపు సమస్యలను పరిష్కారమయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటి తహసీల్దార్ దివాకర్‌రెడ్డి, ఆర్‌ఐ హేమలత పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి: ఏబీవీపీ



ఆందోళన చేస్తున్న నాయకులకు సర్ది చెబుతున్న ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం జేఎన్‌టీయూలో ఏబీవీపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ప్రిన్సిపాల్ కార్యాలయంముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ అఖిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థులను డీబ్రెన్ చేయడం సరికాదన్నారు. ఉద్యోగులు సమయానికి విధులకు హాజరు కావడంలేదన్నారు. స్పందించిన ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి నాయకులతో మాట్లాడారు. నిబంధనల మేరకే కళాశాలలో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అనంతరం నాయకులను ఒకటో పట్టణ పోలీసు సిబ్బంది నాయకులను స్టేషన్‌కు తరలించారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించనందుకు పదిమందిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భూతరాజు, దివాకర్‌నాయక్, విజయ్, నితిన్, యశ్వంత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు మారుపేరు శకుంతలమ్మ



శకుంతలమ్మ చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ జిల్లా మాజీ అధ్యక్షురాలు, సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య నాయకురాలు శకుంతలమ్మ నిబద్ధత, నిజాయితీకి మారుపేరని, ఆమె సేవలు మరువలేనివని పలువురు నాయకులు కొనియాడారు. శుక్రవారం ఎన్జీవో హోంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి అధ్యక్షతన ఇటీవల మరణించిన శకుంతలమ్మ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ...40 ఏళ్లలో ఆమె పీడిత ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. ఏఐటీయూసీ, సీపీఐ, మహిళా సమాఖ్యలో పలు ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, మల్లికార్జున, కేశవరెడ్డి, రామకృష్ణ, వీర భద్రస్వామి, రమణ, రాజేష్‌గౌడ్, కుళ్లాయిస్వామి, చిరంజీవి, సంతోష్, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై దేశద్రోహం కేసు నమోదుచేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశారు. ఎస్కేయూ ప్రధాన ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఏఐఎస్‌ఎఫ్‌ఐ నిరసనలో కార్యదర్శి రమణయ్య మాట్లాడారు. ప్రపంచదేశాలకు స్ఫూర్తిగా భారతదేశాన్ని తీర్చిదిద్దిన అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా అవహేళనగా మాట్లాడటం దుర్మార్గమని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, సుబ్బరాయుడు, శ్రీనునాయక్, ఎస్ఎస్‌యూ ప్రసాద్, సంజయ్ పాల్గొన్నారు.

కేబినెట్‌నుంచి తొలగించాలి...

అంబేడ్కర్‌పై అవమానకర వాఖ్యలుచేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కేబినెట్ నుంచి తొలగించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్‌చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, బాలరాజు, గోపాలకృష్ణ, నాగేంద్ర, ఆదెప్ప, ఈశ్వరయ్య, వెంకటేష్, కుళ్లాయప్ప, నరేష్, లక్ష్మయ్య, బాబు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి..

దేశప్రజలకు కేంద్రమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని బహుజన లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నారాయణప్ప ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తొలగించాలన్నారు. బాధ్యత గల కేంద్ర మంత్రిగా ఇలాంటి వ్యాఖ్యలు చేసినందుకు బర్తరఫ్ చేయాలన్నారు.

అవమానించిన వారే సుద్దులు వల్లిస్తున్నారు : బీజేపీ

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పలు సందర్భాల్లో అవమానించిన వారే నేడు సుద్దులు వల్లెవేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు ఒక ప్రకటనలో మండిపడ్డారు. అంబేడ్కర్ సేవలను గుర్తించిన బీజేపీ ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించిందన్నారు. అంబేడ్కర్ నడియాడిన ఐదు ప్రదేశాలలో పంచతీర్థ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మనుగడ కోసం కాంగ్రెస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు మోసపోకుండా భూస్థాపితం చేస్తున్నారని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అసలైన వారసుడిగా ప్రధాని నరేంద్రమోదిని దేశ ప్రజలు గెలిపిస్తున్నారని ఆయన తెలిపారు.



ఎస్కేయూలో ఏఐఎస్‌ఎఫ్ నాయకుల నిరసన, అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

సీఎంఆర్‌ఎఫ్‌లోనూ వైసీపీ రాజకీయం : ఎమ్మెల్యే



బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరులోనూ రాజకీయం చేశారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపడ్డారు. శుక్రవారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గానికి చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలోని పలువురు వైద్యం కోసం వెళ్లిన సమయంలో ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్న వారికి ఆమె సీఎంఆర్‌ఎఫ్ నిధులు వచ్చేలా చొరవ చూపారు. 9 మందికి రూ.19.42 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం విషయంలోనూ గత ప్రభుత్వంలో రాజకీయం చేశారని, సీఎం చంద్రబాబు రాజకీయాలకు అతీతంగా సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు.

ఆసుపత్రికి వీల్‌చైర్స్ వితరణ

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన సిటిజన్ ఫోరమ్



వీల్‌చైర్స్ అందజేస్తున్న సిటిజన్ ఫోరమ్ సభ్యులు

అనంతపురం టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆసుపత్రిలో రోగుల పడుతున్న కష్టాలను చూసి సిటిజన్ ఫోరమ్ సభ్యులు ఆరు వీల్ చైర్లను వితరణ చేశారు. ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో 'నరవాహన' శీర్షికన వీల్‌చైర్స్, స్ట్రెచర్స్ లేక నడవలేని రోగులు నరకయాతన పడుతున్న దృశ్యాలను కళ్లకు కట్టినట్లు ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన సిటిజన్ ఫోరమ్ సభ్యులు మానవత్వం చూపించారు. రోగుల కష్టాలను తీర్చడం కోసం జిల్లా ఆసుపత్రికి ఆరు వీల్ చైర్స్‌ను శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో సిటిజన్ ఫోరమ్ అధ్యక్షుడు రామిరెడ్డి, సభ్యులు హరిశ్చంద్రరామ, ఎస్ఆర్ నాగభూషణ, కిషోర్, బషీర్, ఏలూరు యంగన్న, శివారెడ్డి, చిన్నపరెడ్డి, ఇబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రహణమొర్రికి వైద్య పరీక్షలు

అనంతపురం టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రి ఆవరణంలో ఉన్న డీఈఐసీ సెంటర్‌లో శుక్రవారం గ్రహణమొర్రితో బాధపడుతున్న పిల్లకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఏవీఆర్ ఆసుపత్రి డాక్టర్లు విజయ్‌కుమార్, యశశ్విని హాజరై బాధిత పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఆపరేషన్ అవసరమైన పిల్లలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణస్వామి, మేనేజరు రజిత పాల్గొన్నారు.

18వసారి విజేతగా ఎస్ఎస్‌బీఎన్



క్రికెట్ పోటీల విజేత ఎస్ఎస్‌బీఎన్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర్‌కళాశాల క్రికెట్ పోటీల విజేతగా ఎస్ఎస్‌బీఎన్ జట్టు 18వసారి నిలిచింది. ఎస్కే యూనివర్సిటీ అంతర్‌కళాశాలల క్రికెట్ పోటీలలో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఎస్ఎస్‌బీఎన్, కదిరి బ్లూమూన్ కాలేజీ జట్ల మధ్య ఫైనల్ పోటీ నిర్వహించారు. ఎస్ఎస్‌బీఎన్ నిర్ణీత 25ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 259పరుగులు చేసింది. అర్జున్ టెండూల్కర్ 122, జయకృష్ణ 71పరుగులు చేశారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కదిరి బ్లూమూన్ జట్టు 25ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 169పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఎస్ఎస్‌బీఎన్ 90పరుగుల తేడాతో విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. ఎస్వీ డిగ్రీ కాలేజీ చైర్మన్ సోమశేఖర్ రెడ్డి, ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్వీ డిగ్రీ పీజీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు నాయక్, పీడీలు పాల్గొన్నారు.

రూరల్ క్రికెట్ లీగ్‌లో అనంత, ధర్మవరం జట్ల గెలుపు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రూరల్ క్రికెట్ లీగ్‌లో అనంత, ధర్మవరం జట్లు గెలుపొందాయి. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. తొలుత నార్పల, అనంత స్పోర్ట్స్ అకాడమీ(ఏఎస్ఏ) జట్లు తలపడ్డాయి. నిర్ణీత 25ఓవర్లలో ఏఎస్ఏ వికెట్ నష్టపోకుండా 352పరుగులు చేసింది. ఇందులో బ్యాటర్లు చైత్ర 155పరుగులు, పూర్ణచంద్రిక 158పరుగులతో అజేయంగా నిలిచి రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నార్పల 13.1ఓవర్లలో 51పరుగులకే కుప్పకూలింది. ఏఎస్ఏ బౌలర్లు హస్విరెడ్డి 7, మాన్విత 3వికెట్లు పడగొట్టారు.

● మరో మ్యాచ్‌లో గుంతకల్లు, ధర్మవరం జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన గుంతకల్లు 13ఓవర్లలో 66పరుగులకే ఆలౌట్ అయ్యింది. స్వల్పలక్ష్యంతో బరిలోకి దిగిన ధర్మవరం 9.2ఓవర్లలో వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. పోటీలను జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి పర్యవేక్షించి, సెంచరీలు చేసిన క్రీడాకారులను అభినందించారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జేఎన్‌టీయూ ఓటీపీఆర్‌ఐ కళాశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి విద్యార్థులకు సూచించారు. గతనెలలో ఫార్మసీ కళాశాలల మధ్య నిర్వహించిన పోటీల్లో ఓటీపీఆర్‌ఐ విద్యార్థులు కప్‌ను గెలుపొందారు. శుక్రవారం డైరెక్టర్ సుబ్బారెడ్డిని కలిసి విద్యార్థులు కప్‌ను అందజేశారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి : సీపీఎం

అనంతపురం రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కందుకూరు గ్రామంలో ఈనెల 23,24 తేదీల్లో నగరంలో జరిగే సీపీఎం 14వ జిల్లా మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతులయ్య, సుబ్బిరెడ్డి, ప్రతాప్, సుబ్బారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఐసీయూ కాట్ వితరణ

ఆత్మకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సౌకర్యార్థం ఐసీయూ కాట్‌ను శుక్రవారం టీడీపీ వాణిజ్య విభాగం నాయకుడు కార్తీక్‌నందన్ వితరణ చేశారు. తండ్రి శ్రీరామరామయ్య వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రికి ఐసీయు కాట్‌ను వితరణ చేసినట్లు పేర్కొన్నారు.

పరిశోధనల్లో నాణ్యత పాటించాలి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విశాలి గోర్పాడే పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల పీహెచ్‌డీ విద్యార్థులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా..

మంచి నడవడిక అలవర్చుకోవాలి: కాలవ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ మంచి నడవడికలు అలవరచుకోవాలని, అప్పుడే "మంచి వ్యక్తులుగా గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని చదం గ్రామంలో క్రీస్తు నూతన ప్రార్థన మందిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ మంచి నడివడికలను అలవర్చుకోవాలన్నారు. ప్రేమ , త్యాగం ఉన్నవారు సమాజంలో మంచి వ్యక్తులుగా పేరు పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, టీడీపీ నాయకుడు పాటిల్ అజయ్‌రెడ్డి, ఫాస్టర్లు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో ఓపెన్‌ఫోరం

రాయదుర్గంటౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గల ప్రణాళిక విభాగంలో శుక్రవారం నిర్వహించిన ఓపెన్‌ఫోరం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం ఓపెన్‌ఫోరం నిర్వహిస్తున్నట్లు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ తెలిపారు. ఇండస్ట్రియల్ ఏరియాలో భవన నిర్మాణం కోసం అనుమతులు మంజూరు చేయాలని ఒకరు కోరగా.. మిగిలిన వారందరూ భవన నిర్మాణ అనుమతుల కోసం అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సర్వేయర్లు, ప్రజలు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న హింసను అరికడదామని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అరుణ, హరిత పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారు ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మహిళలపై అత్యాచారాలను అరికట్టండి, మహిళా హింసను నిరోధించండి అంటూ నినాదాలు చేశారు. వైద్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భయం లేకుండా స్వేచ్ఛగా జీవించడానికి అర్హులన్నారు. హింసను అంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్య బోధకులు సత్యనారాయణ, వేణుగోపాల్, మైత్రి సంఘం అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో పోలీసుల నిఘా

గుంతకల్లు టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్ ట్యాంక్, రైల్వేస్టేషన్, హనుమాన్ సర్కిల్, ఆలూరు రోడ్డులో వన్‌టౌన్ సీఐ మనోహర్ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలపై శుక్రవారం నిఘాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘీక కార్యక్రమాలను అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు ఆ సాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రోన్ కెమరా ద్వారా మద్యం సేవిస్తున్న, అనుమానస్పదంగా తిరుగుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఇంటి నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): 1994లో పట్టాలు పొందిన బీడీకార్మికులు ఇంటి నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్‌నాయుడు తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గతంలో స్థలాలు ఉన్న వాటిని గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడానికి ప్రయత్నించగా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి బీడీ కార్మికుల తరపున కోర్టుకు వెళ్లి నిలబెట్టించారని తెలిపారు. ఆ స్థలాలను పక్కాగృహాలు కట్టించేందుకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి చొరవచూపారన్నారు. 1994లో స్థలాలు పొందిన బీడీ కార్మికులు తక్షణమే పట్టాలతోపాటు సంబంధించిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, కుల, ఆదాయ ధృవీకరణపత్రాలు, బ్యాంక్ ఖాతా పుస్తకం అందజేయాలని ఆయన కోరారు. పట్టాలో ఉన్న ప్రతి ఒక్కరూ రెండురోజుల్లో ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ విషయాన్ని గమనించి త్వరగా అందజేయాలని వారు సూచించారు.

వివాహేతర సంబంధంతో ..

- భర్తను హత్యచేయించిన భార్య
- భార్య, ప్రియుడు సహా నలుగురి అరెస్టు

కొండాపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా యల్లనూరు గ్రామానికి చెందిన సురేశ్ (36) ఈ నెల 17న మండలంలోని లావనూరు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు హత్యగా నిర్ధారించారు. వివాహేతర సంబంధం కారణంగా అతని భార్య, ప్రియుడు కలిసి హత్య చేయించారని పోలీసులు వెల్లడించారు. శుక్రవారం కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ విద్యాసాగర్‌లు వివరాలు వెల్లడించారు. యల్లనూరు గ్రామానికి చెందిన చిన్నగుల్లొబన్నగారి సురేశ్ భార్య వీరకుమారికి కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన గజ్జప్పగారి బాబుతో వివాహేతర సంబంధం ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరూ కలిసి ఊరు వదిలి వెళ్లిపోయారు. ఆమె తిరిగి భర్త వద్దకు వచ్చినప్పటి నుంచి ఇద్దరికి గొడవలు జరిగేవి. ఆ తర్వాత ఆమె పుట్టింటికి వెళ్లి ఉంటోంది. ఈ నేపథ్యంలో వీరకుమారి, బాబు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. సురేశ్ ఉంటే తమకు అడ్డువస్తాడని సురేశ్ హత్యకు పన్నాగం పన్నారు. ఈ నేపథ్యంలో బాబు స్నేహితుడు వెలిదండ్ల సుభాన్‌కు రూ.లక్ష, కిరణ్ అనే వ్యక్తికి రూ.యాభైవేలు ఇచ్చి సురేశ్ హత్యకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనెల 16వ తేదీ రాత్రి బర్త్‌డే పార్టీ కొండాపురంలో ఉందని సుభాన్, కిరణ్‌లు బొలెరో వాహనంలో సురేశ్‌ను ఎక్కించుకున్నారు. లావనూరు గ్రామం వద్ద ఉన్న నల్లవంక బ్రిడ్జి వద్దకు రాగానే సురేశ్‌కు ఎక్కువ మోతాదులో మద్యం తాగించారు. స్పృహకోల్పోయిన తర్వాత నల్లని తాడుతో సురేశ్ గొంతు బిగించి హత్యచేసి మృతదేహాన్ని బ్రిడ్జిపై పడేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహం వద్ద తాగిన మద్యం బాటిళ్లు, నీళ్ల ప్యాకెట్లు గ్లాసులు ఉంచారు. దీంతో అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటటేశ్వరరావు ఆదేశాల మేరకు కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, విద్యాసాగర్ గత మూడు రోజులుగా యల్లనూరు పోలీసుల సహకారంతో కేసును ఛేదిం చారు. గురువారం సాయింత్రం బాబు, సుభాన్, కిరణ్, వీర కుమా రి లను అరెస్టు చేసి.. బొలేరో వాహనం, పల్సర్‌బైకు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.. వీరిని ప్రొద్దుటూరు కోర్టులో హజరు పరచగా కడప జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలపారు.



మధ్యలోనే ఆగిపోయిన తరగతి గదుల నిర్మాణం



అసంపూర్తి గదిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

ఇంకెన్నాళ్లీ అవస్థలు..?

- బూదగవి జడ్పీ హైస్కూల్లో తరగతి గదుల కొరత
- అసౌకర్యానికి గురవుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- వైసీపీ పాలనలో నిలిచిపోయిన నూతన గదుల నిర్మాణం

ఉరవకొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో చెట్ల కింద, నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిన భవనాల్లో చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆ పాఠశాలలో 3 నుంచి పదో తరగతి వరకూ 180 మంది దాకా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో ఎనిమిది తరగతి గదులకు గాను కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. 2016లో ఆర్‌ఎంఎస్‌ఏ కింద రూ.65 లక్షల వ్యయంతో అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. మూడు గదులను శ్లాబ్ వరకు కాంట్రాక్టర్లు పూర్తి చేశారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడడంతో పనులు అర్థంతరంగా ఆగిపోయాయి. ఐదేళ్లు దాటినా ఆ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. దీంతో ఉన్న గదుల్లోనే విద్యార్థులు అసౌకర్యాల నడుమ విద్యనభ్యసిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న గదుల్లో గోడలకు బోర్డులను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. దుమ్మూ, ధూళి వచ్చి పడుతుండడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇది ఇలా ఉండగా, నాడు నేడు పనులు కింద ఆ పాఠశాలలో చేపట్టిన పనులు కూడా ఆగిపోయాయి. ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభించినా.. శ్లాబ్ దశలోనే ఆగిపోయాయి. ఇంకా ఎన్నాళ్లు తమ పిల్లలు ఈ అవస్థలు పడాలని, కూటమి ప్రభుత్వ హయాంలోనైనా పనులు పూర్తి అయ్యేనా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.

ఈ విషయంపై ఎంఈవో ఈశ్వరయ్యను వివరణ కోరగా ఆర్‌ఎంఎస్‌ఏ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ సుముఖత వ్యక్తం చేశారని, నాడు- నేడు పనులకు నిధులు లేక నిలిచిపోయాయని తెలిపారు.

వెలుగు క్లస్టర్ రివ్యూ సమావేశం

- పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

పెద్దపప్పూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ శక్తి భవనంలో శుక్రవారం తాడిపత్రి క్లస్టర్ రివ్యూ సమావేశాన్ని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీక్ష సంఘం సభ్యులు తయారుచేసే ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో నమోదుచేసి వాటికి మంచి ధర , ఎక్కువ వ్యాపారం జరిగేలా డీఆర్‌డీఏ సిబ్బంది పనిచేయాలని సూచించారు. ప్రతి సంఘం సభ్యురాలిని, ఉత్పత్తిదారులను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయాలని అన్నారు. బ్యాంక్ లింకేజీ , స్త్రీనిధి వంటి రుణాలను పూర్తిస్థాయిలో రికవరీ చేయాలని తెలిపారు. ప్రతి మహిళను లక్షాధికారి చేసేందుకు సిబ్బంది కృషిచేయాలని అన్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ రాధారాణి, డీపీఎంఓ సత్యనారాయణ, శ్రీనిధి మేనేజర్ హమినేష్‌బాబు, ఏపీఓ శివకుమార్‌రెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు విజయమ్మ, ఐదు మండలాల ఏపీఓలు, సీసీలు, అకౌంటెంట్‌లు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయం క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థులతో కరస్పాండెంట్, డైరెక్టర్

గుంతకల్లు టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయం క్రీడా పోటీలకు పట్టణంలోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల కరెస్పాండెంట్ కేసీ హరి, కళాశాల డైరెక్టర్ గోపాల్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం అంతర్ విశ్వవిద్యాలయం వివిధ క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్ కళాశాల పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో ఈనెల 26నుంచి 31వరకు జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయం జరిగే ఖోఖో మహిళల విభాగంలో 7మంది, ఫుట్‌బాల్‌లో ఒకరు, తిరునంతపురం సెంట్రల్ యూనివర్శిటీలో జరిగే పురుషుల ఖోఖో విభాగంలో 6మంది, తమిళనాడులోని అన్నాయూనివర్శిటీలో జరిగే కబడ్డీ పోటీలకు ఒకరు, చండీఘర్ విశ్వవిద్యాలయంలో జరిగే రబ్బీ పోటీలకు ఇద్దరు, తమిళనాడులోని అలగప్ప విశ్వవిద్యాలయంలో జరిగే కబడ్డీ మహిళల పోటీలకు ఇద్దరు, కర్ణాటకలోని ధార్వడ్ విశ్వవిద్యాలయంలో జరిగే షటిల్ పోటీలకు ఒకరు, జనవరి 12నుంచి 18వరకు పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో జరిగే బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు 5మంది, ఫిబ్రవరి 27న మైసూర్ యూనివర్శిటీలో జరిగే క్రికెట్ పోటీలకు ఇద్దరు, మార్చి 12నుంచి 19వరకు మంగళూరులోని కొట్టాయం యూనివర్శిటీలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీలకు ఒకరు ఎస్కే యూనివర్శిటీ తరపున పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులు మరిన్ని విజయాలను సాధించాలని అకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులకు అధ్యాపకులు అభినందించారు.

జాతరను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆరె కటికసంఘం నాయకులు

గుత్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆరె కటికల ఆరాధ్యదైవం సునామ జకినీ మాత, మల్యామ జకినీ మాత అమ్మవార్ల ఉత్సవాలను ఫిబ్రవరి 6, 7తేదీలలో నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలంటూ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణ్‌రావు కోరారు. పట్టణంలోని సునామ జకినీ మాత ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం లక్ష్మణ్ రావు మాట్లాడుతూ అమ్మవార్ల 22వ జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. భక్తులు భారీగా తరలిరావాలని కోరారు. అనంతరం జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త సురేష్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సాయినాథ్, మహిళా అధ్యక్షురాలు సరస్వతీబాయి, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

కూడేరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరుట్లపల్లి గ్రామంలో శుక్రవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు కురుగుంట బ్రహ్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత గ్రామంలో బాలికలు జ్యోతులతో ఆలయం వద్దకు ఊరేగింపుగా వచ్చారు. అనంతర అర్చకులు విగ్రహాన్ని ప్రత్యేక పూజలతో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి మహేశ్వరి, లాయర్ హరి, వాల్మీకులు నీళ్ల ఓబుశపతి, అక్కులన్న, రాము, మనోజ్‌కుమార్, వాజారప్ప, నరసింహులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహం

కేంద్రప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన

బ్రహ్మసముద్రం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుడిమేపల్లి, కోనాపురం గ్రామాల్లో శుక్రవారం కేంద్రప్రభుత్వ బీమా పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజనపై శుక్రవారం లీడ్ జిల్లా మేనేజర్ నరసింగరావు ప్రజలకు అవగాహన కల్పించారు. తర్వాత 500 మంది చేత ఇన్సూరెన్స్ చేయించారు. సర్పంచ్ వనిత మల్లికార్జున, ఎఫ్‌ఎల్‌సీ విజయ్ కుమార్, సీఎఫ్‌ఎల్ సిబ్బంది నారాయణ, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం

గుంతకల్లుటౌన్,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆల్ ఇండియా పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రైల్వే ఆసుపత్రి సీఎంఎస్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ డీపీఓ క్యాబ్రియల్ అరోర్, సీనియర్ డీఎఫ్‌ఎం రామిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం రైల్వే పెన్షనర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డీఎంఓ మధుకుమార్, అసోసియేషన్ డివిజన్ సెక్రెటరీ సుంకప్ప, బ్రాంచ్‌అధ్యక్షుడు రామ్మూర్తి, డివిజన్ అధ్యక్షుడు జయంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు సత్యవిజయరాజు, సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష

బ్రహ్మసముద్రం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సీజనల్ వ్యాధులపై అక్కడి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యాధికారులు, సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. మండల వైద్యాధికారులు రాజేష్‌కుమార్, అప్తాబ్, సూపర్‌వైజర్ మేరీ రామలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం

గుంతకల్లు టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. భవానీ మాలదారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పాత గుంతకల్లులోని శివాలయం వద్ద కనకదుర్గమ్మ ఉత్సవ మూర్తిని వివిధ పుష్పాలతో అలంకరణ చేసి రథంలో కొలువుదీర్చారు. అర్చకులు పూజలు చేసిన అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాల మధ్య బీరప్ప సర్కిల్, బస్టాండ్ సర్కిల్, పాతబస్టాండ్, మార్కెట్ రోడ్డు మీదుగా ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

తాడిపత్రి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వైష్ణవి పాఠశాలలో ఈనెల 22న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి సాయిబాబా, అధ్యక్షుడు శివయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో 150మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు.

ఎస్‌సీఆర్‌ఎంయూ గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడిగా బీఎం బాషా



బీఎం బాషా

గుంతకల్లు టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి):సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూరు యూనియన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడిగా బీఎం బాషా నియమితులయ్యారు. సికింద్రాబాద్‌లో జోనల్ సెక్రెటరీ శంకర్రావు ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో రేణిగుంటలో లోకో పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్న బీఎం బాషాను సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూరు యూనియన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడిగా, ఏడీఎస్‌గా ఎం శ్రీనివాసులును, జోనల్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా జీ సురేష్‌కుమార్ ఎన్నుకున్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణుమాకులపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఏపీ ఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో రూ.5 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడు తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని అన్నారు. అలాగే షేక్షానుపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్ భూమి పూజ చేశారు. నాయకులు రణధీర్, భాస్కర్, నరసింహులు, ఎర్రిస్వామి, ఆనంద్, ఓబులరాయుడు, అమరేష్, చలపతి, నరేష్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

పెద్దవడుగూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అనాథలకు, వృద్ధులకు ఎస్ఐ ఆంజనేయులు, సీపీఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి దుప్పట్లు పంపిణీ చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రంగనాథరావు అనే దాత 60దుప్పట్లు సరఫరా చేయడంతో వాటిని వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు వరలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

యల్లనూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన మహేష్ కనిపించడం లేదని అతడి భార్య సాయికుమారి శుక్రవారం తమకు ఫిర్యాదుచేసినట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. మహేశ్ తన భార్య సాయికుమారితో బుధవారం రాత్రి గొడవపడాడు. గురువారం తెల్లవారుజామున ఎటో వెళ్లిపోయాడు. అనంతరం తిరిగి రాలేదు. దీంతో భార్య ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ మేరకు కేసునమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

గుత్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని సీపీఐ, బీఎస్పీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, బీఎస్పీ నాయకుడు గద్దల నాగభూషణం మాట్లాడుతూ.. అంబేద్కర్ ఒక మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయన్ను అవమానించే విధంగా మాట్లాడిన అమిత్‌షాను తక్షణమే కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బాచి, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకుడు మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ నాయకుడు అడవిరాముడు, మాలసంఘం నాయకుడు చంద్ర, సీపీఐ నాయకులు నరసింహయ్య, రాజు, నజీర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

యాడికి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని మలేరియా నివారణ జోనల్ అధికారి లక్ష్మణ్‌నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. మలేరియా, డెంగీ వ్యాధులపై కేసులు ఏమైనా నమోదయ్యాయా అని అక్కడి వైద్య సిబ్బందిని ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ జోనల్ పరిధిలోని 8జిల్లాల్లో మలేరియా నివారణపై పూర్తిస్థాయి అవగాహన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఇంతవరకు జోనల్ పరిధిలో మలేరియా- 55, డెంగీ 1676 కేసులు నమోదైనట్లు చెప్పారు. తిరుపతి, కర్నూలు జిల్లాల్లో మలేరియా, డెంగీ కేసుల నమోదు ఎక్కువగా ఉందన్నారు. అనంతపురం జిల్లాలో ఆ కేసుల నమోదు పూర్తిగా తగ్గిపోయిందని తెలిపారు. ఆయన వెంట మలేరియా నివారణ తాడిపత్రి సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, జోనల్ కార్యాలయ ఎంపీహెచ్‌ఈఓ నిత్య పూజయ్య, వైద్యులు దేవరాజన్, అప్పయ్య తదితరులు ఉన్నారు.

కురుబ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం

అనంతపురం అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కురుబ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు శు క్రవారం జిల్లాకేంద్రంలోని కురుబ సంఘం కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి అంజనేయులు, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల కృష్ణయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బ్యాళ్ల నాగేంద్ర ఆయనకు నియామకపు ఉత్తర్వులు అందజేశారు. తనకు పదవి అప్పగించిన నాయకులకు శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. కురుబ సంఘం అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు.

బడికి వచ్చేది పనులు చేయడానికా?

- పిల్లలతో పనులు చేయించడంపై తల్లిదండ్రుల ఆగ్రహం

యాడికి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యాభ్యాసం చేయడానికి బడికి వచ్చిన విద్యార్థులచేత పైప్‌లైన్ కోసం గుంత తవ్వించిన సంఘటన శుక్రవారం మండలంలోని రాయలచెరువు హైస్కూల్‌లో చోటుచేసుకుంది. రాయలచెరువు హైస్కూల్‌లో కెమిస్ట్రీ ల్యాబ్‌లో నీటి అవసరాల కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేయడం కోసం పనులను ఒక వ్యక్తికి కాంట్రాక్ట్ అప్పగించారు. కాంట్రాక్ట్ తీసుకున్న ఆ వ్యక్తి పాఠశాలకు వచ్చిన తన సమీప బంధువులైన విద్యార్థులను పిలుచుకుని గుంత తవ్వే పని చేయించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. చదువు కోసం పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో ఇలా పనులు చేయించడమేమిటని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహిస్తున్నారు. దీనిపై హెచ్‌ఎం డేనియల్‌ను వివరణ కోరగా కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి సమీప బంధువులు అయిన విద్యార్థులతో పని చేయించుకుననట్లు తెలిసిందన్నారు. ఇకపై ఇలాంటివి జరనివ్వమని తెలిపారు.

వరి సాగుపై అవగాహన

బొమ్మనహాళ్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధర ఘట్ట చెరువు ఆయకట్టు కింద రబీసీజన్‌లో వరి పంట సాగుపై శుక్రవారం భూగర్భజలశాఖ అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భూగర్భజల శాఖ అధికారి అప్పలనాయుడు మాట్లాడుతూ రైతులు తక్కువ నీటితో తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. వేసవిలో పంటలు దిగుబడి రావాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. రైతులు రబీసీజన్‌లో ఇబ్బందులకు గురికాకుండా వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలు సాగుచేయాలని అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, చెరువు సంఘం అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు వెంకటేశులు, మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, నాయకులు ఎర్రిస్వామి, లారీ చంద్ర, రైతులు పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు

కణేకల్లు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకపోయినా, సమయ పాలన పాటించకపోయినా చర్యలు తప్పవని డీసీహెచ్ రవిరావు హెచ్చరించారు. మండల కేంద్రంలో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీహెచ్ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మందులు ఇచ్చే ఫార్మాసిస్టుల స్థానంలో మరో అసిస్టెంట్ విధులు నిర్వహించడంపై మండిపడ్డారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణ, ఓపీ స్లిప్పులు పంపిణీలో నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో వైద్యసిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. గర్భిణీలకు సాధారణ డెలివరీలు చేసేందుకు ప్రాముఖ్యత ఇవ్వాలని ఆదేశించారు. వైద్యులు నిరీష పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

బెళుగుప్ప, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీఐ చిన్నగౌస్ విద్యార్థినులకు మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు మహిళా బాలిక రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎస్ఐ శివ,సిబ్బంది పాల్గొన్నారు.